ప్రభాతనవ

SINGIDI | తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

మంగళవారం 11 ఆగస్టు 2026 | సంపుటి: 1 | సంచిక: 55 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

### ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు



మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు.

- న్యూఢిల్లీ (సింగిడి)

2



2

### అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్టంభన తప్పదు: రాహుల్ గాంధీ

---

TGSRTC

# స్టీరింగ్‌పై భారం.. టికెట్‌పై టార్గెట్

భారం పెరిగింది.. ఒత్తిడి పెరిగింది.. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే టీజీఎస్‌ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి పెరుగుతోందన్న ఆవేదన వినిపిస్తోంది. బస్సు నడపడం, టికెట్లు ఇవ్వడం, చిల్లర లెక్కలు చూసుకోవడం, ప్రయాణికులను సమన్వయం చేయడంతో పాటు.. రోజువారీ టార్గెట్లను చేరుకోవాల్సిన పరిస్థితి ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. సిబ్బంది కొరత, ఎక్కువ పని గంటలపై ఉద్యోగ సంఘాలు గతంలోనూ ఆందోళన వ్యక్తం చేశాయి.

హైదరాబాద్ బ్యూరో (సింగిడి)

### టీజీఎస్ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లపై పెరుగుతున్న పనిభారం

**డైలీ టార్గెట్లతో ఉద్యోగులపై ఒత్తిడి**

**టార్గెట్ చేరకపోతే మందలింపుల ఆరోపణలు**

**బదిలీల భయంతో విధులు నిర్వహణ**

**టార్గెట్లతో పెరుగుతున్న ఒత్తిడి**

ఉద్యోగుల వాదనల ప్రకారం.. కొందరు కండక్టర్లకు రోజువారీ టికెట్ విక్రయాలపై నిర్దిష్ట లక్ష్యాలు ఉంటున్నాయి. పురుష ప్రయాణికుల టికెట్ల విషయంలో దాదాపు 11 వేల చిల్లర, మహిళా ప్రయాణికుల టికెట్ల విషయంలో 16 వేల చిల్లర వరకు టార్గెట్ చేరుకోవాల్సి వస్తోందని వారు చెబుతున్నారు. అయితే ప్రతి రూట్‌లో ప్రయాణికుల సంఖ్య ఒకేలా ఉండదు. రూట్, ఆక్యుపెన్సీ, ట్రాఫిక్, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలు మారుతున్నా.. టార్గెట్ ఒత్తిడి మాత్రం ఉంటోందని ఉద్యోగులు వాదిస్తున్నారు.

**టార్గెట్ మిస్.. మందలింపుల ఆరోపణలు**

లక్ష్యం చేరుకోలేని సందర్భాల్లో ఉద్యోగులను ఉన్నతాధికారులు మందలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నిసార్లు సహోద్యోగుల ముందే తీవ్రంగా మాట్లాడటం మానసిక ఒత్తిడిని పెంచుతోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఇప్పటికే గంటల తరబడి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఇలాంటి ఒత్తిళ్లు అదనపు భారంగా మారుతున్నాయని అంటున్నారు.



**పనిభారం.. ఆరోగ్యంపై ప్రభావం**

డ్రైవర్లపై పని ఒత్తిడికి సంబంధించిన ఆందోళనలు కొత్తవి కావు. 2025లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు దీర్ఘ పని గంటలు డ్రైవర్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని, సిబ్బంది కొరత వల్ల పని గంటలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అదే సమయంలో టీజీఎస్ఆర్టీసీ అధికారులు ఆరోగ్య పరీక్షలు, ఆరోగ్య శిబిరాలు, డిపో స్థాయిలో ఆరోగ్య పర్యవేక్షణ వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**మహాలక్ష్మి తర్వాత.. అదనపు భారం**

మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమలైన తర్వాత మహిళా ప్రయాణికుల రద్దీ పెరగడంతో సిబ్బందిపై పని భారం పెరిగిందని ఉద్యోగ సంఘాలు 2026 ఏప్రిల్‌లో ఆందోళన సందర్భంగా పేర్కొన్నాయి. సిబ్బంది నియామకాలు, మెరుగైన పని పరిస్థితులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

**సేవలతో పాటు ఉద్యోగుల సంక్షేమం**

ఆర్టీసీ బస్సుల్లో రోజూ లక్షలాది మంది ప్రయాణిస్తారు. ప్రయాణికులకు సమయానికి, సురక్షితంగా సేవలు అందించాలంటే డ్రైవర్, కండక్టర్ ఆరోగ్యం కూడా కీలకం. టార్గెట్లు ఉంటే రూట్ పరిస్థితులు, ప్రయాణికుల రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల పనితీరును మెరుగుపరిచే విధంగా మానవీయ పర్యవేక్షణ అవసరం.

**టార్గెట్ కాకపోతే.. బదిలీ భయం**

టార్గెట్లు సాధించలేని ఉద్యోగులకు మరో ప్రాంతానికి బదిలీ చేస్తారనే భయం ఉందని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. అయితే బదిలీలు పరిపాలనా అవసరాల మేరకే జరుగుతున్నాయా, టార్గెట్లతో వాటికి సంబంధం ఉందా అన్న అంశంపై అధికారిక స్పష్టత అవసరం.

**అసలు సమస్య.. టార్గెట్లా, పని పరిస్థితులా**

ఆర్టీసీ ఆదాయం పెరగాలి.. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందాలి. కానీ ఆ లక్ష్యాల భారాన్ని ఉద్యోగుల ఆరోగ్యంపై మోపడం సరికాదు. టార్గెట్ ఉండాలి.. ఒత్తిడిగా మారకూడదు. పర్యవేక్షణ ఉండాలి.. అవమానంగా మారకూడదు. బదిలీ పరిపాలనా ప్రక్రియగా ఉండాలి.. ఒత్తిడి సాధనంగా మారకూడదు. ప్రయాణికుల భద్రత ఎంత ముఖ్యమో.. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఉద్యోగుల ఆరోగ్యం, గౌరవం కూడా అంతే ముఖ్యం.

---



## సాగర్‌లో ముగిసిన వరుణయాగం

**పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు**

**వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు**

రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమ గుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు.

నాగార్జునసాగర్,ఆగస్ట్10 (సింగిడి)

2

## ముగిసిన సర్ ప్రక్రియ

### రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు



2

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ పక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది.

- హైదరాబాద్,ఆగస్ట్10 (సింగిడి)

---



పోలవరం తొలిదశ నిర్మాణానికి

## కేంద్రం ఆమోదం

### సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు

2

**న్యూఢిల్లీ,ఆగస్ట్10 (సింగిడి):** పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది.

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

**ప్రజల అభిమానం చూరగొన్న నేత**

**నర్సంపేట కాలేజీఇకి పెద్ది పేరు పెడతాం**

**సంతాపసభలో కేటిఆర్ వెల్లడి**



2

ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు.

నర్సంపేట,ఆగస్ట్10 (సింగిడి)

## తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి



**రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి.. మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ**

తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

హైదరాబాద్,ఆగస్ట్10 (సింగిడి)

2

గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

## ఇంధన రంగం అభివృద్ధి

**2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం లక్ష్యం**

**అమెరికా పర్యటనలో డిప్యూటీ సిఎం భట్టి**



**హైదరాబాద్,ఆగస్ట్10 (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు.

2



పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా

## ఇవ్వలేం

2

**కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి**

**రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

---



2

కొలంబియాను కుదిపేసిన

## భారీ భూకంపం

**69 మంది మృతి**

డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ

# వైఎస్సార్‌సీపీ నిరసన

**పలు చోట్ల లాఠీఛార్జీలు చేయడంపై ఆందోళన.. అడ్డుకున్న పోలీసులు**

నిరసనల ర్యాలీలకు ప్రజల్లో

### అనూహ్య స్పందన

**డిఎస్సీ అక్రమాలపై వైసిపి పోరాటం సక్సెస్**

**పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**




2



డీఎస్సీ నిర్వహణలో

### అవకతవకలు

సీబీఐ విచారణకు బొత్స డిమాండ్



మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న

## రంగనాథ్

**నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకోని హైడ్రా**

**మీడియాతో చిట్‌చాట్‌లో రాంచందర్‌రావు విమర్శలు**

2

### తక్షణమే కాళేశ్వరం

## మోటర్లు ఆన్ చేయండి

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్లినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, ఆదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

## మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్న రంగనాథ్

**నాదర్‌గుల్ ఆక్రమణలపై చర్యలు తీసుకుని హైడ్రా**

**మీడియాతో చిట్‌చాట్‌లో రాంచంద్రరావు విమర్శలు**

హైదరాబాద్,ఆగస్టు10 (సింగిడి): హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. హైకోర్టు చెప్పినా రంగనాథ్ తీరు మారడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. రంగనాథ్‌కు మజ్లిస్ మీదున్న ప్రేమ.. ప్రజల మీద లేదని విమర్శించారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్నారు. నాదర్‌గుల్‌లో చాలా ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని ప్రశ్నించారు. అక్కడ ఎన్నో ఎకరాల భూమిలో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని తెలిపారు. వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతున్న హైడ్రా.. మరి ఆ భూములను ఎక్కడ దాచిపెట్టారు.. ఎందుకు ప్రజల ముందు ఉంచడం లేదని నిలదీశారు. పరిపాలనలో లోపంతోనే అధికారులపై ఆరోపణలు వస్తున్నాయని రామచందర్‌రావు విమర్శించారు. సల్కమ్ చెరువులో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోర్టులను కూడా అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. న్యాయస్థానాల ఆదేశాలున్నా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చూస్తూ ఊరుకోం. హ్యూర్‌పై ఆగస్ట్ 15 తర్వాత భాజపా ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తాం. ఆ తర్వాత ఉద్యమాలు ఉద్ధృతం చేస్తాం. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిని రెండేళ్ల తర్వాత తప్పకుండా మారుస్తారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత జీహెచ్‌ఎంసీ ఎన్నికలు ఉంటాయని అనుకుంటున్నాం. ఇథనాల్‌తో వాహనాల ఇంజిన్లు పాడైపోతాయని ఇండియా కూటమి తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరుసగా కామెంట్లు చేస్తే.. తాము రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని వాయు యాగం చేస్తామన్నారు. వానాకాలం అంతా అయిపోయాక రేవంత్ రెడ్డికి ఇటో కొత్త నాటకమంటూ విమర్శించారు. రాష్ట్రంలో ఎల్లినో ఉన్న విషయం సీఎంకు తెలియదా అని రాంచందర్ రావు ప్రశ్నించారు.

### పాలమూరు ప్రాజెక్టుకు

## జాతీయ హోదా ఇవ్వలేం

**కేంద్రం మరోమారు తెలంగాణకు మొండిచేయి**

**రాజ్యసభలో రేణుకాచౌదరి ప్రశ్నకు కేంద్రం సమాధానం**

**న్యూఢిల్లీ,ఆగస్టు10 (సింగిడి):**

కేంద్రంలోని మోడీ సర్కార్ తెలంగాణకు మరోసారి మొండిచేయి చూపింది. తెలంగాణ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేమని చెప్పింది. ఆ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని తేల్చిచెప్పింది. ప్రాజెక్టు టెక్నో ఎకనామిక అప్రైజల్‌ను ప్రస్తుతం చేపట్టలేమని.. కృష్ణా జలాల వినియోగం, అంతర్రాష్ట్ర అంశాలు ట్రిబ్యునల్ పరిధిలో ఉందని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో రావాలంటూ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట డీపీఆర్‌ను కేంద్రం తిరిగిన వెనక్కి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర సాయం విషయంలోనూ తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ప్రస్తుతం జరుగుతోన్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి రాజ్యసభలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట జాతీయ హోదా గురించి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంపీ రేణుకా చౌదరి ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చే ప్రతిపాదన ప్రస్తుతం కేంద్రం పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్ 2 పరిధిలో అంతర్రాష్ట్ర అంశాలు ఉండటంతో టెక్నో–ఎకనామిక అప్రైజల్ సాధ్యం కాదని, సమగ్ర ప్రణాళికతో డీపీఆర్‌ను మళ్లీ సమర్పించాలని సూచించారు. ప్రాజెక్టుకు సాయం విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. అంతేకాకుండా, ప్రాజెక్టుకు కేంద్ర నిధుల సాయం అందించే విషయంలోనూ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. జాతీయ ప్రాజెక్టు హోదా అనేది ప్రధానంగా జాతీయ ప్రాధాన్యం, అంతర్రాష్ట్ర లేదా అంతర్జాతీయ జల వివాదాలు లేకపోవడం , గణనీయమైన సాగునీటి సామర్థ్యం ఆధారంగా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారమే ఇస్తామని కేంద్రం పునరుద్ఘాటించింది. కృష్ణా జలాలపై క్లియరెన్సులు, ట్రిబ్యునల్ పరిధిలోని అంశాలు తేలితే తప్ప ఈ ప్రాజెక్టు హోదాపై తదుపరి నిర్ణయం తీసుకోవడం సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది.

### గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

## ఇంధన రంగం అభివృద్ధి

**హైదరాబాద్,ఆగస్టు10 (సింగిడి):**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్–ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం–కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్–టెక పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

**కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు**

**న్యూఢిల్లీ,ఆగస్టు10 (సింగిడి):**



దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మోదీ ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని ల్వీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది. అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

# డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ నిరసన

అమరావతి,ఆగస్టు10 (సింగిడి): డీఎస్సీ అక్రమాలను నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ర్యాలీలను అడ్డుకోవడం, నేతలను అదుపులోకి తీసుకోవడం.. పలు చోట్ల లాఠీఛార్జీలు చేయడంపై వైఎస్సార్‌సీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నిరసనలను అడ్డుకోవడం చంద్రబాబు ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. డీఎస్సీ నియమకాల్లో జరిగిన అవినీతికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయడం, ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కోరుతూ అభ్యర్థులు, డీఎస్సీ సంఘాలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పలుచోట్ల పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు. పులివెందులలో పోలీసులు దౌర్జన్యకాండకు పాల్పడ్డారు. పులివెందులలో ఆర్డీవోకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ శ్రేణులపై లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురికి గాయాలు కాగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు వినిపించాయి. అంతకు ముందు.. ఎంపీ అవినాశ్‌రెడ్డికి ర్యాలీ నిర్వహించడానికి వీల్లేదంటూ పోలీసులు నోటీసులు అందించారు. చీపురుపల్లిలో నిర్వహించాల్సిన నిరసన కార్యక్రమానికి వెళ్తున్న సీనియర్ నేత, మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణను పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ పోలీసులు అడ్డుకోవడం సరికాదని బొత్స మండిపడ్డారు. రోడ్డుపైనే ఆయన ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నానిని గుడివాడ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. డీఎస్సీ అంశంపై నిరసనల్లో పాల్గొనకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ పరిణామంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆయన అభిమానులు మండిపడుతున్నారు. అటు రాజమండ్రిలోనూ మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో నిరసనలు జరుగుతుండగా.. పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుపై ఆయన మండిపడ్డారు. విశాఖపట్నంలోని మారియట్ సెంటర్ వద్ద నిరసనకు ప్రయత్నించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. కేకే రాజు సహా పలువురిని అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.

### డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు

రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో తీవ్ర అవకతవకలు జరిగాయని, దీనిపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంపై విమర్శల దాడి చేశారు. విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత మంత్రిని పదవి నుంచి పక్కన పెట్టాలని స్పష్టం చేశారు. యువత, నిరుద్యోగులు తమ సమస్యలపై గత డెబ్బై రోజులకు పైగా పోరాటం చేస్తున్నారని, వారు ర్యాలీలు చేయడానికి ప్రయత్నిస్తే పోలీసులు అడ్డుకోవడం సరికాదని మండిపడ్డారు. వెనక్కి వెళ్తామన్నా ఒప్పుకోకుండా, కనీసం శాంతియుత ర్యాలీలకు కూడా అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలకు, చేతలకు పొంతన ఉండటం లేదని విమర్శించారు. వచ్చే ఆదాయంలో సగం డబ్బులు ఉద్యోగుల జీతాలకే సరిపోతున్నాయని చెబుతున్న చంద్రబాబు, ఎన్నికల ముందు చెప్పిన సంపద సృష్టి ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. ఒకవైపు సంపద సృష్టిస్తామని చెప్పి, మరోవైపు రాష్ట్రాన్ని తీవ్ర అప్పుల పాలు చేస్తున్నారని ధ్వజమె

### నిరసనల ర్యాలీలకు

## ప్రజల్లో అనూహ్య స్పందన

**డిఎస్సీ అక్రమాలపై వైసిపి పోరాటం సక్సెస్**

**పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి**

**అమరావతి,ఆగస్టు10 (సింగిడి):**

వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందని పార్టీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. తాజాగా డీఎస్సీ అక్రమాలపై వైఎస్సార్‌సీపీ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరసన ర్యాలీలు విజయవంతం కావడంతో సజ్జల మీడియాతో మాట్లాడారు. తాము అడిగిన దాంట్లో వాస్తవం లేకపోతే ప్రజల నుంచి ఇంత స్పందన ఎలా వస్తుందని ప్రశ్నించారు. 'వైఎస్సార్‌సీపీ నిరసన ర్యాలీలకు ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మా పోరాటాలను అణచివేయాలని చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ర్యాలీలు విజయవంతమయ్యాయి. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రతి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. నిరసన కార్యక్రమాలను ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నాం. అందుకే వైఎస్సార్‌సీపీ పోరాటాను అణగదొక్కాలనే ప్రయత్నం చేస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగింది వాస్తవం కాబట్టే చంద్రబాబు ఉలిక్కిపడుతున్నారు. ఈ స్కాం నుంచి చంద్రబాబు, లోకేష్ తప్పించుకోలేరు. డీఎస్సీ అక్రమాలపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదు. నిరసనలపై కూటమి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పటివరకూ ఇవ్వలేదు. మేం అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పలేకపోతోంది. డీఎస్సీలో అక్రమాలు జరిగినట్లు క్లియర్‌గా తెలుస్తోంది. ఉన్నతస్థాయిలోనే తప్పు జరిగిందనే విషయం అర్థమవుతోంది. అక్రమాలు జరిగాయి కాబట్టే సీబీఐ విచారణకు భయపడుతున్నారు. లీకేజీ జరిగిందనడానికి తిరుగులేని ఆధారాలున్నాయి ఒక తప్పును కవర్ చేయడానికి తప్పుల మీద తప్పులు చేశారు. అక్రమాలు బయటకు రావడంతో సర్టిఫికెట్లు కూడా టాంపర్ చేసి మార్చారు' అని సజ్జల ధ్వజమెత్తారు.

### సాగర్‌లో ముగిసిన

## వరుణయాగం

కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రీ జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

### పోలవరం తొలిదశ నిర్మాణానికి

## కేంద్రం ఆమోదం

2024–25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్–కమ్–రాకఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ర్అండ్ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు నిర్వాసితుల పునరావాసం, పునరావాస పనులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు కొనసాగుతున్నాయని రాజ్యసభకు ఇచ్చిన సమాధానంలో కేంద్ర జలశక్తి శాఖ పేర్కొంది.

## తెలంగాణ కోసమే బతికిన పెద్ది

లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తో తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్న వారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు.

# కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం

పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనల కారణంగా 69 మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అనేక భవనాలు పేకమేడల్లా కూలిపోవడంతో శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుని ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం చోకో ప్రాంతంలోని శాన్ జోస్ డెల్ పల్మార్ పట్టణానికి సమీపంలో, భూమికి సుమారు 107 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. భూకంప తీవ్రతకు పెరీరా, కాలి, క్విబ్డో, మనీజల్స్ వంటి నగరాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క పెరీరా నగరంలోనే 18 మంది మరణించినట్లు ఆ నగర మేయర్ మౌరిసియో సలాజర్ తెలిపారు. మనీజల్స్‌లోని చారిత్రక నియో–గోతిక్ కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. భూకంపం ప్రభావం పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పెరీరా, మనీజల్స్, క్విబ్డో సహా ఆరు విమానాశ్రయాలు దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించాయి. రాజధాని బొగోటాలోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు.

### రంగంలోకి దిగిన ప్రభుత్వం

కొలంబియా నూతన అధ్యక్షుడు అబెర్లార్డో డి లా ఎస్ప్రియెల్లా వెంటనే సహాయక చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ విపత్తు నిర్వహణ విభాగంలో యూనిఫైడ్ కమాండ్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి, నష్టాన్ని అంచనా వేయాలని, బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. తాను స్వయంగా భూకంప ప్రభావిత ప్రాంతమైన పెరీరాలో పర్యటించి, ప్రభుత్వ సహాయక చర్యలను సమీక్షిస్తానని ఎక్స్ వేదికగా తెలిపారు. "ఈ కష్టకాలంలో ఉన్న కొలంబియా ప్రజలకు నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఒంటరి కాదు. ప్రభుత్వం మీకు అండగా ఉంది. ప్రభావిత ప్రాంతాల పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతి చర్యా తీసుకుంటాం" అని అధ్యక్షుడు భరోసా ఇచ్చారు. కొలంబియాలో సాధారణంగా చిన్నపాటి భూప్రకంపనలు సంభవిస్తున్నప్పటికీ, 6.0 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపాలు రావడం అరుదు.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

**న్యూఢిల్లీ,ఆగస్టు10 (సింగిడి):**

మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు. ఏటా స్వాతంత్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారీ జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

## అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

**న్యూఢిల్లీ,ఆగస్టు10 (సింగిడి):**

పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చిచెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్సలో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## ముగిసిన సర్ ప్రక్రియ

**హైదరాబాద్,ఆగస్టు10 (సింగిడి):**

తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ..సర్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు తేల్చారు. తెలంగాణలో 73,95,954 మంది ఓటర్లను తొలగించినట్లు సమాచారం. ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పక్రియ పూర్తయ్యింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 94.30 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. ఆ తర్వాతి స్థానాల్లో మెదక 90.54 శాతం, సూర్యాపేట 90.43 శాతంతో ఉన్నాయి. ఇక, హైదరాబాద్ 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం డిజిటలైజేషన్ పూర్తై చివరి స్థానంలో నిలిచింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం, జగిత్యాల జిల్లాలో 89.60 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యింది. రెండు సార్లు గడువు పొడిగించినప్పటికీ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో డిజిటలైజేషన్ శాతం పెరగలేదు. కాగా, తెలంగాణలో సర్ పక్రియ పూర్తయినట్లు ఈనెల 12న సీఈవో ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అలాగే, ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానున్నట్లు సమాచారం. ఆ తర్వాత నెల రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణ కొనసాగనుంది. అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది.

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
11-8-2026



## ప్రైవేట్ ఆస్పత్రులు తప్పనిసరిగా
# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠినచర్యలు
- జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి లలితా దేవి



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 10 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా, పోతిరెడ్డిపల్లిలోని కే బి ఆర్ లైఫ్ కేర్ ఆసుపత్రి ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి , డా. దీప్తి మరియు డా. ఎ. ప్రవీణ్ కుమార్ లు సోమవారం తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఆసుపత్రి ల్యాబొరేటరీలో గడువు ముగిసిన లేబరటరీ కిట్స్ గుర్తించబడ్డాయి. గడువు ముగిసిన కిట్లను ఉపయోగించడం వల్ల పరీక్షా ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉండటంతో పాటు, రోగుల ఆరోగ్యానికి ముప్పు కలిగే అవకాశం ఉన్నందున, ల్యాబొరేటరీని తక్షణమే సీజ్ చేయడం జరిగింది. అదేవిధంగా, ఆసుపత్రిలోని స్కానింగ్/అల్ట్రాసౌండ్ విభాగానికి సంబంధించిన అనుమతి/రిజిస్ట్రేషన్ గడువు ఈ రోజుతో ముగుస్తున్నప్పటికీ, సంబంధిత అనుమతిని పునరుద్ధరించేందుకు అవసరమైన దరఖాస్తు సమర్పించలేదని తనిఖీలో గుర్తించారు. నిబంధనలకు అనుగుణంగా చెల్లుబాటు అయ్యే అనుమతి లేకుండా స్కానింగ్ సేవలు నిర్వహించకుండా ఉండేందుకు స్కానింగ్ రూమ్ను కూడా సీజ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు, రోగుల భద్రతా నిబంధనలు మరియు చట్టపరమైన అనుమతులను పాటించాలని సూచించారు. గడువు ముగిసిన మందు లు, ల్యాబొరేటరీ కిట్లు లేదా ఇతర వైద్య సామగ్రిని ఉపయోగించడం, అలాగే చెల్లుబాటు అయ్యే అనుమ తులు లేకుండా వైద్య సేవలు నిర్వహించడం సహించ బడదని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులు తమ వద్ద ఉన్న లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు, ల్యాబొరేటరీ కిట్ల గడువు తేదీలు మరియు తప్పనిసరి రికార్డులను ఎప్పటికప్పుడు పరిశీలించుకుని, అన్ని నిబంధనలను పాటించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ సూచించింది. నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రు లపై చట్ట ప్రకారం కఠినమైన చర్యలు కొనసాగుతాయని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి స్పష్టం చేశారు.

## ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా
# జైలు భరో కార్యక్రమ ర్యాలీ అడ్డుకున్న పోలీసులు



**వికారాబాద్, ఆగస్టు 10(సింగిడి):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన జైలు భరో కార్యక్రమం వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం వివిధ సంఘాలు సీఐటీయూ , ఏ ఐ కే ఎం ఎస్, ఏ ఐ కే ఎస్, కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, మహిళా, విద్యార్థి, యువజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన రాస్తా రోకో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో నిర్వహించిన భారీ ప్రదర్శనలో తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, అఖిల భారత రైతు కూలీ సంఘం, సిఐటియు, డైఫ్ డి వై ఎఫ్ ఐ, ఎస్ ఎఫ్ ఐ, కే వి పి ఎస్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, ప ఐద్వా, మహిళా సంఘం, తదితర ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, ఏఐకె ఎమ్ ఎస్ జిల్లా కార్యదర్శి మ హేందర్, తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్ లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చెయ్యాలన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోర్లను, విద్యుత్ సవరణ చట్టాన్నకి, ఉపాధి కూలీలకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన రాంజీ బిల్లును రద్దు చేయాలని, అడవి హక్కుల చట్టాన్ని నీరుగారుస్తున్న కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని రైతులకు గిడ్డబాటుదారాలు కల్పించాలని వారు కోరారు. మార్కెట్ షెడ్లు ఏర్పాటు చేసి ఎం ఎస్ పి అమలు చేయాలని స్వదేశాన్ని వ్యవసాయాని వీడి విదేశీ వాణిజ్య ఒప్పందాశీ చేసుకోవడం వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని అందరిని ప్రభుత్వ ఉద్యోగా గుర్తించాలని, అందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కేంద్రస ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నామన్నారు. రాబోయే కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయనిచో కార్మికులు రైతులు కూలీలు పోరాటాల ఆగ్రహానికి గురికాక తప్పదని హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం, ఏఐకేఎం, తెలంగాణ రైతు కూలీ సంఘం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు తేజా,గిరిజన సంఘం శ్రీనివాస్ మహిళా సంఘం, అనసూయ, లక్ష్మి, కె వి పి ఎస్ జిల్లా అధ్యకులు నవీన్, మల్లేష్ లక్ష్మమ్మ, జ్యోతి ఆశ రాములు రాజు, వినోద్, సురేష్, బాబా, ప్రవీణ్, జాఫర్, రాజు, వేణు గోపాల్, బుచ్చయ్య, రాజు. నాయకులు మున్సిపల్ తదితర రంగాల కార్మికులు నర్సింలు సతీష్, నర్సమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని ర్యాలీని నిలిపి వేశారు.

## అమ్మవారి ఆశీస్సులతో
# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

### యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి



**పటాన్చెరు, ఆగస్ట్ 10 (సింగిడి):** పటాన్‌చెరులోని శ్రీరామ్ నగర్ కాలనీ, కృషి డి ఫెన్స్ కాలనీలలో నిర్వహించిన బోనాల పండుగ వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగమైన తోట్టెల ఊరేగింపు కార్యక్రమానికి తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్ ఆదిత్యరెడ్డి అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కాలనీవాసులకు, పటాన్చెరు ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కాలనీ పెద్దలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తోట్టెల ఊరేగింపును నిర్వహించారు.

# ముగిసిన సర్ ప్రక్రియ

### 17న ఓటర్ల ముసాయిదా జాబితావిడుదల



**అల్వాల్, ఆగస్టు 10 (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది ఇందులో భాగంగా చేపట్టిన ఇమ్యునరేషన్ పత్రాల సమర్పణ,వాటి డిటిలైజేషన్ ప్రక్రియ 10 ఆగస్టు గడువుతో ముగియనుంది. ఫారాలు సమర్పించని ఓటర్లకు ఇదే ఆఖరి అవకాశం అనిఅధికారులు స్పష్టం చేశారు. పత్రాలు సమర్పించని చోఓటరు జాబితా నుండి తొలగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈనెల 17న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లెల శివ, కృష్ణ గౌడ, లక్ష్మణ్ రావు, టీవీ భాస్కర్ రాజేందర్,సుదర్శన్ రెడ్డి, భబిత, లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

### పలు దేవాలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**అల్వాల్, ఆగస్టు 10(సింగిడి):** బోనాల పండుగను పురస్కరించుకుని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు దేవాలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వేమూరి శ్రీధర్ గౌడ్, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు.

### ఓటర్ నమోదు ప్రతిఒక్కరి బాధ్యత
### కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున గౌడ్



**వికారాబాద్, ఆగస్టు 10(సింగిడి):** ఓటర్ నమోదు ప్రక్రియ ముగింపు సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ 31వ వార్డు కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున గౌడ్ కోరారు. సోమవారం శివరాం నగర్‌లోని పార్క్‌వద్ద బూత్‌స్థాయి అధికారులు (బీ ఎల్ వో ) యాదమ్మ, సల్మా మరియు బిఎల్ఏలు శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్ సీనియర్ నాయకులు లక్ష్మణ్ గుప్తాలతో కలిసి ఆయన ఓటర్ నమోదు ప్రతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఓలు స్థానికులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నిరసన



**వికారాబాద్, ఆగస్టు 10(సింగిడి):** వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలోని తాండూర్, వికారాబాద్ రోడ్డుపై బైఠాయించి భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి నిరసన తెలిపారు. హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై దండయాత్ర చేస్తామని రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం శ్రేణులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఆ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం తీవ్రంగా బాధాకరమని అన్నారు. ఎన్నికల సమయంలో వికలాంగుల పెన్షన్లను రూ. 6,000కు పెంచుతామని, వికలాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని, తెలంగాణలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తామని, రాష్ట్రంలో అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చిన మాటలుగానే మిగిలిపోకూడదని, వికలాంగులు కూడా ఈ రాష్ట్రానికి సమాన హక్కులు కలిగిన పౌరులేనని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి పోతురా సుధీర్ ఆధ్వర్యంలో, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నరసింహా ఈ నిరసన కార్యక్రమంలో సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పసుల చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్య, పరిగి డివిజన్ నాయకులు లక్ష్మయ్య, సంఘం నూతన నాయకులు బొంపల్లి ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, నారాయణ, జంగయ్య, యాదయ్య, జే. రాములు, మహిళా నాయకురాళ్లు లక్ష్మి, భాగ్యమ్మ, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మురడి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ



**వికారాబాద్, ఆగస్టు 10 (సింగిడి):** భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు రాష్ట్ర పార్టీ సూచనలతో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయా పట్టణాలల్లో, గ్రామాల్లో సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. భారతీయ జనతా పార్టీ వికారాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర బీజేపీ మెడికల్ సెల్ కన్వీనర్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇంటి సభ్యులందరితో కలిసి జాతీయ జెండా స్ఫూర్తిని పంచుకోవాలని సూచించారు. భారతదేశం ఎన్నో సంవత్సరాల పాటు విదేశీ పాలనలో అనేక కష్టాలను ఎదుర్కొందని, దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. వారి త్యాగాలు, దేశభక్తి, స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్యం మనకు ఎంతోమంది మహనీయుల త్యాగాల ఫలితంగా లభించిందని, ఈ స్వేచ్ఛ విలువను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందన్నారు. దేశభక్తి భావనను ప్రతి ఇంటికీ తీసుకు వెళ్ళేవిధంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. జాతీయ జెండా మన ఐక్యతకు, దేశభక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి భావంతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. వికారాబాద్ లోని 18,19 వార్డుల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్ ప్రవీణ్ రెడ్డి, బీజేపీ పట్టణ ఉపాధ్యాక్షుడు జీ. అశోక్ముదిరాజ్, నాయకుడు కె శ్రీకాంత్, బూత్ ప్రెసిడెంట్ బీ. సంతోష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

### పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్చెరు, ఆగస్టు 10(సింగిడి):** ఆషాఢమాసం బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఉదయం పటాన్చెరు పట్టణంలోని వివిధ కాలనీలలో గల అమ్మవారి దేవాలయాలు, గ్రామ దేవతల ఆలయాలను పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారు ఆకాంక్షించారు. ఆషాఢ మాస బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించు కోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నిర్వాహకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే గారికి ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. పండుగ సందర్భంగా కాలనీల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

### ఘనంగా బోనాల పండుగ



**అల్వాల్, ఆగస్టు 10(సింగిడి):** ఆషాడ బోనాల ఉత్సవాలు భాగంగా ఆదివారం నవీన్ యాదవ ఆధ్వర్యంలో ఉప్పలమ్మ, నలపోచమ్మ దేవాలయంలో భక్తి శ్రద్ధలతో పూజల నిర్వహించారు,అమ్మవార్లకుతొట్టెల సమర్పించారు. నవీన్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆషాడ బోనాలు ఘనంగా నిర్వహించారు. పోతరాజుల డప్పు వాయిద్యాల మధ్య యువకుల కేరింతలు డాన్సులు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున గౌడ్, మాచర్ల శ్రీనివాస్, రాంసింగ్, రవికుమార్, వజ్రం నాగరాజ్, చంద్రమోహన్, నర్సింగ్ యాదవ్, భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బీరంగూడ గుట్టపై
## ఘనంగా శత రుద్రాభిషేకం

### ఆరుద్ర నక్షత్ర పూజల్లో పాల్గొన్న
### వందమంది వీరశైవ జంగమ అర్చకులు
### భక్తిశ్రద్ధలతో కొనసాగిన ప్రత్యేక పూజలు



**అమీన్‌పూర్, ఆగస్ట్ 10 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బీరంగూడ గుట్టపై వెలసిన శ్రీ భ్రమరాంబా సహిత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆరుద్ర నక్షత్ర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వీరశైవ జంగమ అర్చక పురోహిత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 15వ ఆరుద్ర నక్షత్ర పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా సుమారు వంద మంది వీరశైవ జంగమ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మల్లికార్జున స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వేదమూర్తులు శివ శ్రీ సాంబశివ శర్మ, మహంతయ్య స్వామి, అర్చక సంఘం అధ్యక్షుడు పురంతు వీరయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక సంఘం సభ్యులతో పాటు దేవాలయ ప్రధాన అర్చకుడు ప్రహ్లాద స్వామి, ఆలయ కార్యనిర్వహణ అధికారి దేవనాదం, ఆలయ కమిటీ సభ్యుడు సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆరుద్ర నక్షత్ర పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వామివారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

ప్రభాతవర సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 11-8-2026

# ఎడిటోరియల్

Editorial

## జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి !

పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా కూటమి ప్రభుత్వమే. సిఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ కూడా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్ఖం÷–డ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనీమా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్‌డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని వేసింది. లీకేజ్ వీరులపై చర్యలు తీసుకునేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషులపై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ కూడా పట్టుబట్టాలి. కేవలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్‌తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది. మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల లో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై కేవలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శించారు. గతంలో సిఐఇడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకురావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు. సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

## త్యాగానికి ప్రతిరూపం బత్తిని మొగిలయ్య

బత్తిని మొగిలయ్య గౌడ్ ఓరుగల్లుకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు. రజాకార్లను ఎదిరించి పోరాడి అమరుడైన వీరుడు.




బత్తిని మొగిలయ్య గౌడ్ వరంగల్ తూర్పు కోట నివాసి. తల్లిదండ్రులు బత్తిని చెన్నమ్మ, మల్లయ్యలు, అన్న బత్తిని రామస్వామి గౌడ్... చెన్నమ్మ, మల్లయ్య దంపతుల ఐదవ సంతానంగా ఆ కాలపు దీరుడిగా ఖిల్లా ఓరుగల్లులో పాఠాలు నేర్చుకున్నాడు. మొగిలయ్య కోట బడిలో 4వ తరగతి వరకు చదివాడు. బత్తిని మొగిలయ్య గౌడ్, బత్తిని రామస్వామి గౌడ్ లిద్దరు ఆర్యసమాజ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు.

అన్న రామస్వామి, భూపతి కృష్ణమూర్తి, ఇతర కాంగ్రెస్ వాదులతో కలిసి కాంగ్రెస్, ఆర్యసమాజ్ సమావేశాలకు వెళ్లేవాడు, అన్నదమ్ములు అన్ని విషయాలలో తోడుగా ఉంటూ, గౌడ కుల వృత్తి అయిన తాళ్లు ఎక్కతూ వ్యవసాయం చేసేవారు.

గౌడ్ ల పరిస్థితి చాల దుర్భరంగా ఉండే నాటి పరిస్థితులలో, నిజాం ప్రభువు కల్లు మీద, తాడిచెట్ల మీద పన్నులు వసూలు చేయడాన్ని, పన్నులు కట్టని గౌడులకు విధించే శిక్షలను ఆయన జీర్ణించుకునే వాడు కాదు. నిజాం పోలీసులన్నా, రజాకార్లన్నా ఆయనకు తీవ్ర వ్యతిరేకత ఉండేది.

స్వతంత్ర అభిలాషను విస్తృత పరిచే దిశగా పన్నెండవ జాతీయాంధ్ర మహాసభలు 1946లో వరంగల్ లోని మడికొండలో జరిగాయి. రహస్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు జాతీయ జెండా ఎగుర వేయాలనేది సభల ఉద్దేశం. నిజాం రాష్ట్రంలో త్రివర్ణ పతాకావిష్కరణ అధికారికంగా నిషేధించ బడింది. జెండా ఎత్తడం అంటే దెబ్బలకు, జైలుశిక్షకు, మరణానికి వెరవకుండా చేసే సాహసోపేత కార్యక్రమమే. వరంగల్ కోటలో దేశభక్తి ప్రేరితులు అయిన యువకులు బత్తిని రామస్వామి గౌడ్, బత్తిని మొగిలయ్య గౌడ్, సంగరబోయిన కనకయ్య, సంగరబోయిన మల్లయ్య, నరిమెట్ల రామస్వామి, వడ్లకొండ ముత్తయ్య, పోశాల కనుకయ్య, ఆరెల్లి బుచ్చయ్య తదితరులు జెండా వందన కార్యక్రమాలను కోట ప్రజల సమక్షంలో నిర్వహించే వారు. స్టేట్ కాంగ్రెస్, కార్యకర్తలందరికి రహస్యంగా నైనా జెండా ఎగుర వేయాలనే ఆదేశాలిచ్చింది. స్టేట్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం వరంగల్ లోని చైతన్యం కలిగిన యువకులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్యసమాజ్ కార్యకర్తలు వరంగల్ కోటలో జెండా ఎగుర వేసే వారు.

11 ఆగస్టు 1946 ఆదివారం రోజు ఉదయం7.30 గంటలకు వరంగల్ తూర్పు కోటలో జెండా ఎగుర వేయడానికి వరంగల్, హన్మకొండ నుండి వచ్చి, కాంగ్రెస్ నాయకులు యం.యస్. రాజలింగం, టి.హయగ్రీవాచారి, భూపతి కృష్ణమూర్తి, మదూరి రాజలింగం, బత్తిని సోదరులు కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హయగ్రీవాచారి జెండాను ఎగురవేయగా, త్రివర్ణ పతాకం వందనం చేసి పిల్లలు పెద్దలంతా జై కొట్టారు.

అప్పుడే సుమారు రెండు వందల మంది రజాకార్లు, వారి అనుయాయులు మారణా యుధాలతో ఖాసీం షరీఫ్ అనే రజాకార్ నాయకుని అధ్వర్యంలో, జెండా ఎత్తిన నాయకులను చంపడానికి నిజాం అనుకూల నినాదాలను చేస్తూ జెండా ఎత్తిన ప్రాంతానికి చేరుకున్నారు. ఎగిరిన జెండాను చూసి, కోపం కట్టలు తెంచుకున్న రజాకార్లు, జెండాను దించి తొక్కి, తగలబెట్టి, అంతా కలిసి బత్తిని రామస్వామి గౌడ్ ఇంటి వైపు అరుస్తూ, తిడుతూ వెళ్ళారు. జెండా ఎత్తిన ప్రధాన నాయకులైన హయగ్రీవ చారి, భూపతి కృష్ణమూర్తి, పంచాయతి హవల్దారు కె.సమ్మయ్య, వెంకట్రాం నర్సయ్య, యం.యస్.రాజలింగం వీరందరూ బత్తిని రామస్వామి ఇంట్లో కూడి, భవిష్యత్తు జెండా వందన కాంగ్రెస్ కార్యక్రమాల గురించి చర్చించు కుంటున్నారు. ఆ ఇంటి చుట్టూ మోహరించిన రజాకార్లు ఇంట్లోకి వెళ్ళి వాళ్లను చంపే ప్రయత్నం చేసారు. లోపల ఉన్న భూపతి కృష్ణమూర్తి కాంపౌండ్ కు గొళ్లెం పెట్టగా, రజాకార్లు రాళ్ళతో ఇంట్లోని వాళ్ళ మీద దాడి చేశారు. తలుపులు బద్దలు కొట్టి, జెండా ఎత్తిన నాయకులందరిని చంపాలని చూసారు. జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలయ్య, అనంతరం తాళ్లెక్కడానికి తాటి వనానికి వెళ్లాడు. మొగిలయ్య భార్య లచ్చవ్వ 15 రోజుల బాలింత, పురిటి బిడ్డతో మంచంపై ఉంది. మొగిలయ్య భార్య లచ్చవ్వ, తల్లి చెన్నమ్మ ఈ దాడితో భీతిల్లి పోయారు. శనిగారం పుల్లయ్య అనే ఆర్యసమాజ్ కార్యకర్త తాటి వనంలో ఉన్న మొగిలయ్యను కలిసి రజాకార్ల దాడి గురించి చెప్పాడు. దాడి గురించి విన్న మొగిలయ్య ఒక్క క్షణం నిశ్చేష్టుడై, మరుక్షణం తన ఇంటివైపు పరుగు తీసాడు. ఆ ఇంట్లో ఉన్న వాళ్లంతా వందల మంది రజాకార్ల చేతుల్లో చనిపోయేట్టుగా ఉందని భావించి, తన ఇంటి వెనుక దర్వాజా నుండి రజాకార్ల కంటబడకుండ ఇంట్లోకి వెళ్ళి, మెరుపు వేగంతో ఇంటి సూరు లోని పదునైన కత్తిని తీసి, మెరుపులా రజాకార్ల మూకపై పడి యుద్ధం మొదలు పెట్టాడు. ఈ దాడికి నాయకత్వం వహించిన ఖాసీం షరీఫ్ తో సహా, రజాకార్లంతా చీమల పుట్ట చెదిరి నట్లుగా చెదిరిపోయారు. రజాకార్లు తిరిగి మొగిలయ్య పై మూకుమ్మడిగా రెండవ మారు దాడికి పాల్పడ్డారు. రెండవసారీ మొగిలయ్య వారిని తరిమివేశాడు, కానీ మూడవసారి దాడిలో ఖాసీం షరీఫ్ బల్లెంతో మొగిలయ్య వైపు వస్తున్నప్పుడు, మొగిలయ్య తన శత్రువును నరకడానికి తన ఎత్తిన కత్తిని తన ఇంటి ముందు గల పందిరి గుంజల మధ్య చిక్కుకుంది. ఇదే అదనుగా భావించిన షరీఫ్ తన బల్లెంతో మొగిలయ్య గుండెల మీద పొడిచాడు. అలా రజాకార్ల మూకుమ్మడి దాడిలో మొగిలయ్య అమరుడైనాడు.

మొగిలయ్యను చంపిన ఖాసీం షరీఫ్ ని అతని అనుయాయులు, తమ భుజాలపై మోస్తూ ఇప్పటి వరంగల్ చౌరస్తాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అప్పటి వరంగల్ తాలుకా దార్ (కలెక్టర్) అబ్దుల్ మొహిత్ మిల్ ఎదురేగి, హంతకుడైన ఖాసీం షరీఫ్ కు పూలమాల వేసి ఆలింగనం చేసుకున్నాడు.జెండా ఎత్తిన నాయకులకు ప్రాణభిక్ష పెట్టి, త్యాగనిరతి కి ప్రతిరూపంగా నిలిచి, 25 సంవత్సరాల వయస్సులోనే అమరుడైన నిష్కళంక దేశభక్తుడు బత్తిని మొగిలయ్య స్మృతి చిరస్మరణీయంగా మిగిలి పోవాలని వరంగల్ నడిబొడ్డున గల జె.పి.ఎన్ రోడ్ లో 1954 లో మొగిలయ్య స్మారక భవనాన్ని ప్రజలు ఏర్పాటు చేసారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## గ్రామీణ ఉపాధికి ఆర్థిక గ్రహణం..!

### కేంద్ర నిధుల కోత – రాష్ట్రాల ధర్మసంకటం



కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన నూతన ఆర్థిక నిబంధనలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక కీలకమైన సామాజిక సంక్షేమ పథకంలో పెద్ద ఎత్తున వ్యయాన్ని పంచుకోవాలని కేంద్రం కోరడం రాష్ట్ర ప్రభుత్వాలకు మింగుడుపడని అంశంగా తయారైంది. ముఖ్యంగా శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం కోసం రకరకాల ఉచిత హామీలు గుప్పించి, ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్న రాష్ట్రాలకు ఈ నిర్ణయం ఒక పెద్ద సవాలుగా మారింది. ఫలితంగా, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలు కేంద్ర నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం ప్రారంభమైనప్పటి నుండి 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' (ప్రస్తుతం 'వికసిత్ భారత్ – గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ – గ్రామీణ్' లేదా ఎదీ–+=ూవీ–+ గా వ్యవహరిస్తున్నది) పూర్తిగా కేంద్ర నిధులతోనే నడిచింది. 2006లో యుపిఎ ప్రభుత్వం దీనిని ప్రారంభించిన మొదటి పదేళ్లు, ఆ తర్వాత వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కూడా కూలీల వేతనాలకు సంబంధించిన పూర్తి ఖర్చును యూనియన్ బడ్జెట్ నుంచే సమకూర్చాయి. కానీ నూతన మార్పుల ప్రకారం, ఒక రాష్ట్రానికి ఉపాధి కల్పన కోసం రూ. 100 కోట్లు అవసరమైతే, అందులో రూ. 60 కోట్లు మాత్రమే కేంద్రం ఇస్తుంది. మిగిలిన రూ. 40 కోట్లను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే తమ సొంత బడ్జెట్ నుంచి కేటాయించాలి. కేవలం హిమాలయ, ఈశాన్య రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిని, శాసనసభలు లేని కేంద్రపాలిత ప్రాంతాలకు పూర్తి నిధులను మినహాయింపుగా ఉంచారు.

ఈ నిర్ణయం వల్ల కేవలం ప్రతిపక్ష రాష్ట్రాలే కాకుండా, భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు కూడా అంతర్గతంగా ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నాయి. పరిమితంగా ఉండే రాష్ట్రాల రాబడిలో ఇంత పెద్ద మొత్తాన్ని ఒకే పథకానికి కేటాయించాల్సి రావడం వల్ల ఇతర అభివృద్ధి పనులకు నిధులు కొరవడే పరిస్థితి ఏర్పడింది. బహిరంగంగా విమర్శించలేకపోయినా, బీజేపీ పాలిత రాష్ట్రాల ఆర్థిక మంత్రులు కూడా తమ పరిమితుల మధ్య మౌనంగానే సతమతమవుతున్నారు. వనరుల పంపిణీలో తమకున్న పరిమితులను పరిగణనలోకి తీసుకోకుండా కేంద్రం సేకరించే పన్నుల్లో తగిన వాటా ఇవ్వకపోవడం, పైగా పథకాల భారాన్ని రాష్ట్రాలపై మోపడం న్యాయం కాదని అంతర్గత చర్చల్లో భావిస్తున్నారు. మరోవైపు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, కేరళ, పంజాబ్, జార్ఖండ్ వంటి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు మాత్రం కేంద్ర నిర్ణయాన్ని బహిరంగంగానే తీవ్రంగా ఖండిస్తున్నాయి.

ఈ వ్యతిరేకతకు కేవలం రాజకీయ కారణాలే కాకుండా సామాజిక, ఆర్థిక మూలాలు కూడా ఉన్నాయి. రాజకీయంగా చూస్తే, ఇది కాంగ్రెస్ హయాంలో వచ్చిన పథకం కావడం, బీజేపీ దీని ప్రాధాన్యతను తగ్గించే ప్రయత్నం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి. సామాజిక కోణంలో పరిశీలిస్తే, గ్రామీణ ప్రాంతాల్లో సరైన పని దొరకని పేద రైతులు, వ్యవసాయ కూలీలకు ఇది ఒక ప్రాథమిక జీవనాధారంగా, ఆదాయ భద్రతగా మారింది. గ్రామాల్లో కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు లేదా వ్యవసాయ పనులు లేని సీజన్లలో ఈ పథకమే కోట్లాది కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. ఇక ఆర్థికపరంగా, ఈ పథకం ఇచ్చే దినసరి కూలీ గ్రామీణ ప్రాంతాల్లో వేతనాలకు ఒక కనీస ప్రామాణికంగా పనిచేస్తోంది. ఈ పథకం అందుబాటులో ఉండటం వల్ల కూలీలు అతి తక్కువ వేతనాలకు పని చేయాల్సిన దుస్థితి తప్పింది. ఒకవేళ ఈ పథకం బలహీనపడితే గ్రామీణ వేతనాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది.

రాష్ట్రాల ఆర్థిక మంత్రులు తమ బడ్జెట్ ప్రసంగాల్లో ఈ నిబంధనల మార్పును తీవ్రంగా తప్పుపట్టారు. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఉపాధి హామీని కేవలం ఒక పథకంగా కాకుండా పౌరుల ఉపాధి హక్కుగా అభివర్ణిస్తూ, గత రెండు దశాబ్దాలుగా ఇది గ్రామాల్లో నిశ్శబ్ద విప్లవం తెచ్చిందని గుర్తుచేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గ్రామీణ కార్మికుల హక్కులను, సమాఖ్య వ్యవస్థలోని వికేంద్రీకరణ సూత్రాలను కాపాడేందుకు న్యాయపోరాటానికి కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కేరళ, తమిళనాడు, పంజాబ్ రాష్ట్రాలు కూడా కేంద్ర వైఖరి గ్రామీణ పేదల ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్రం నిధుల కేటాయింపును తగ్గించడం అంటే రాజ్యాంగం ప్రసాదించిన అధికార వికేంద్రీకరణ భావనకు విఘాతం కలిగించడమేనని స్పష్టం చేశాయి.

అయితే, ఈ రాజకీయ నిరసనలు, విమర్శలు ఎలా ఉన్నప్పటికీ, ఆచరణలోకి వచ్చేసరికి ప్రతిపక్ష రాష్ట్రాలు సైతం వాస్తవ రాజకీయ పరిస్థితిని అంగీకరించక తప్పలేదు. కేంద్రం నిబంధనలు మార్చినప్పటికీ, ఈ ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లలో రాష్ట్రాలు ఈ పథకానికి నిధులు కేటాయించక తప్పలేదు. తమిళనాడు ప్రభుత్వం రూ. 5,057 కోట్లను కేటాయించి, తన 40 శాతం వాటాను నిలబెట్టుకోవడమే కాకుండా, అదనంగా మరో రూ. 100 కోట్లు వెచ్చించి ఉపాధి ?ిలను 150 రోజులకు పెంచుతున్నట్లు ప్రకటించింది. కర్ణాటక, తెలంగాణ, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా తమ బడ్జెట్లలో సరిగ్గా 40 శాతం వాటా నిధులను కేటాయించాయి. కేరళ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలు మొదటి విడతగా కొంత మొత్తాన్ని కేటాయించి, సంవత్సరం చివరినాటికి మిగిలిన నిధులను భరిస్తామని తెలిపాయి.

కేంద్రంపై తీవ్ర అసంతృప్తి ఉన్నప్పటికీ రాష్ట్రాలు ఈ పథకానికి భారీగా నిధులు కేటాయించడానికి బలమైన కారణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, పేదల జీవన ప్రమాణాలను స్థిరంగా ఉంచడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తోంది. ఉపాధి భద్రతతో పాటు ఆర్థిక నిలకడను ఇచ్చే ఇటువంటి పథకాన్ని నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో కొనుగోలు శక్తి తగ్గితే అది పరోక్షంగా దేశ మొత్తం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే, ఎంత ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, కేంద్ర విధానాలతో విభేదిస్తూనే రాష్ట్రాలు తమ వంతు వాటాను కేటాయించి ఉపాధి హామీని ముందుకు తీసుకెళ్తున్నాయి. సమాఖ్య వ్యవస్థలో కేంద్రం మరియు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలి తప్ప, సంక్షేమ పథకాల నిధుల భారాన్ని రాష్ట్రాలపై నెట్టడం శ్రేయస్కరం కాదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించి, తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ 9848559863

## కు(క)మిలి పోతున్నా..!

నువ్వు గులాబీ అయితే..
నేను తెంపి చేజిక్కించుకుంటా
నువ్వు సమాధానం అయితే..
నేను ప్రశ్నను అవుతా
నాకు తాగే అలవాటు లేకపోయినా..
నువ్వు సారా అయితే నే తాగుబోతునవుతా !

గుండెల నిండా కన్నీళ్లు నింపుకొని..
పెదాలపై నవ్వులను అలంకరించి..
నీ ప్రేమ పుస్తకంలో..
నాకు ఒక్క పేజీ ఇవ్వకపోయినా..
నీ కోసం నేను ప్రేమ దీవానా అవుతా !

నీ ఫోటో నేటికీ నవ్వుల్ని వెదజల్లుతోంది..
నీ జ్ఞాపకాల సెగకు క(కు)మిలిపోతున్నా..
కన్నీరు పెట్టనిదే రాత్రి గడవడం లేదు..
ప్రేమ ఎంత మధురమే కదా..
విరహం సదా పుచ్చోడిని చేస్తుంది !

నిన్ను పొందడమనేదే నా ఏకైక లక్ష్యం
నాకు మరే కోరిక లేనే లేదు
నావల్ల నీకు ఏ తప్పు జరగదు
నీకు ఇంత అందాన్ని అద్ది..
ఆ దేవుడే చేసాడు ఓ పెద్ద తప్పు !

మధుజ్యోతి
9949700037



ప్రభాతవర సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
11-8-2026

# ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిపెట్టాలి

- వరి సాగుకు బదులుగా పప్పు దినుసులు, నూనెగింజలు, తృణధాన్యాలు సాగు చేయాలి
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్, ఆగస్టు 10(సింగిడి):** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ పంట మార్పిడిని ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 3.44 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ఇప్పటివరకు 2.86 లక్షల ఎకరాల్లో పంటల సాగు ప్రారంభమైందని, ఇందులో 2.21 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు ఆశాజనకంగా లేకపోవడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉండటంతో మిగిలిన భూముల్లో వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పు దినుసులు, నూనెగింజలు, తృణధాన్యాలతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వీటికి మార్కెట్లో డిమాండ్, మంచి ధర లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్నను విజయవంతంగా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలమైన వాతావరణం, విత్తనాల లభ్యత, నేల రకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, రైతు వేదికల ద్వారా పంట మార్పిడి ఆవశ్యకతను వివరించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకాంత్‌పై దాడి

**ఆసుపత్రిలో పరామర్శించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్**
**దాడిని ఖండించిన ఎమ్మెల్యే**



**కరీంనగర్, ఆగస్టు10(సింగిడి ):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త శ్రీకాంత్‌పై జరిగిన దాడిని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రంగా ఖండించారు. దాడిలో గాయపడి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకాంత్‌ను స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గంగుల కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్‌లో దాడుల సంస్కృతికి బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నాడనే అక్కసుతో బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు తన అనుచరులతో కలిసి శ్రీకాంత్‌పై ఇనుప రాడ్లతో దాడి చేసినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏ పార్టీకి చెందిన వారైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని, రౌడీషీటర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పోలీసులను కోరారు. కరీంనగర్ ఎప్పటికీ ప్రశాంతమైన, సురక్షితమైన నగరంగా ఉండాలని ఆకాంక్షించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ అభివృద్ధికి రూ. 1,650 కోట్లు వెచ్చించి నగరాన్ని అభివృద్ధి చేశామని గంగుల తెలిపారు. నగర అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన ప్రజాప్రతినిధులు దాడులకు పాల్పడటం సరికాదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఘటనను పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో ఆయన కరీంనగర్‌కు రానున్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ చిత్రపటానికి అవమానమా..?

**ఎంపీడీఓపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి**
**కుల సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్**





**మహాముత్తారం, ఆగస్టు 10 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచిన తీరుపై కుల సంఘాల జేఏసీ, అంబేడ్కర్ వాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటాన్ని గౌరవప్రదమైన స్థానంలో ఏర్పాటు చేసి, అంబేడ్కర్ చిత్రపటాన్ని పక్కన ఉన్న పాత టేబుల్‌పై ఉంచడం అవమానకరమని జేఏసీ జిల్లా కన్వీనర్ అజ్మీరా పూల్ సింగ్ నాయక్ ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారని ఆరోపిస్తూ సంబంధిత అధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అధికారి ఇలాంటి చర్యలకు పాల్పడటం ఆందోళనకరమని, ఎంపీడీఓను వెంటనే సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తక్షణమే స్పందించి వాస్తవాలను పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు చేపడతామని పూల్ సింగ్ నాయక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ పీక కిరణ్, కో–కన్వీనర్ రామగిరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటెలిజెంట్ ఐఓటీ నెట్ వర్క్ ఆప్టిమైజేషన్‌పై పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, ఆగస్టు 10(సింగిడి):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధక విద్యార్థి యన్నం భరత్ భూషణ్ డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'ఐఓటీ నెట్ వర్కులలో ఉమ్మడి వనరుల కేటాయింపు, రద్దీ–అవగాహన రౌటింగ్ కోసం హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ వ్యూహాలు: మెటాహ్యూరిస్టిక్, క్వాంటం–ఆధారిత ఫ్రేమ్ వర్కులపై ఒక సమగ్ర అధ్యయనం' చేసి, ఆయన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. అపర్ణ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, భారీ–స్థాయి ఐఓటీ వాతావరణాలలో శక్తి సామర్థ్యం, వనరుల కేటాయింపు, కంజెషన్–అవేర్ రౌటింగ్, నెట్ వర్కు పనితీరును మెరుగుపరచడానికి వినూత్న హైబ్రిడ్ ఆప్టిమైజేషన్ నమూనాలను అందిస్తుందని వివరించారు. ఈ పరిశోధన, స్కేలబిలిటీని మెరుగుపరచడానికి, కమ్యూనికేషన్ ఆలస్యాన్ని తగ్గించడానికి, వనరుల నిర్వహణను ఆప్టిమైజ్ చేయడానికి, అధునాతన జీవ–ప్రేరిత మెటాహ్యూరిస్టిక్ అల్గారిథమ్, క్రాస్–లేయర్ ఆప్టిమైజేషన్, ఇంటెలిజెంట్ ఎడ్జ్–ఫాగ్–క్లౌడ్ కంప్యూటింగ్ ఫ్రేమ్ వర్కులను ఏకీకృతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న ఐఓటీ ప్రోటోకాల్ లతో పోలిస్తే, శక్తి సామర్థ్యం, లేటెన్సీ, త్రూపుట్, రూటింగ్ స్థిరత్వం, నెట్ వర్కు జీవితకాలంలో గణనీయమైన మెరుగుదల ఉందని సిమ్యులేషన్ ఫలితాలు నిరూపించాయన్నారు. ఈ పరిశోధన ఫలితాలకు స్మార్ట్ సిటీలు, ఆరోగ్య సంరక్షణ, పారిశ్రామిక ఐఓటీ, ప్రెసిషన్ అగ్రికల్చర్, పర్యావరణ పర్యవేక్షణ, ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టములలో విస్తృతమైన అనువర్తనాలు ఉన్నాయని తెలిపారు. ఇవి తదుపరి తరం ఐఓటీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తపరిచారు. డాక్టర్ భరత్ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర ఎస్. మహబూబ్ బాషా, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి

- సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి
- నిత్యావసర ధరలు తగ్గించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి
- కార్మిక, దళిత, ఆదివాసీ హక్కులను కేంద్రం కాపాడాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




**కోదాడ,ఆగస్టు 10(సింగిడి):** కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు చరమగీతం పాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, భద్రాద్రి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆగస్టు 6 నుంచి 14 వరకు చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా అనంతగిరి మండలం శాంతినగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న చేపట్టనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, కార్మికులు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోందని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజారోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలని కోరారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయకుండా మరింత పటిష్టంగా అమలు చేయాలని, గ్రామీణ కూలీలకు తగినన్ని పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, కార్మిక చట్టాలను కాపాడాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాలను విరమించుకోవాలని కోరారు. దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న అక్రమ దాడులను అరికట్టి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. రాజ్యాంగ హక్కులు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు రాజ్యాంగం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుగుణంగా ఎన్నికలను బ్యాలెట్ పేపర్ పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో చేపట్టే పోరాటానికి తెలంగాణ నుంచి భారీగా తరలివెళ్లాలని కూనంనేని సాంబశివరావు కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, బత్తినేని హనుమంతరావు, మేకల శ్రీను తంబాల శ్రీను, , గుండు వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సైదులు, మండల కార్యదర్శి యరసాని రవికుమార్, జిల్లా యూత్ కార్యదర్శి డేగ వీరన్న, సర్పంచ్ వాడకొప్పుల ఉమా , ఉప సర్పంచ్ స్వాతి, మండల సహాయ కార్యదర్శి లాలు, మండల కౌన్సిల్ సభ్యులు, గ్రామ శాఖ సభ్యులు, సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.




## ఉద్యమకారులను గుర్తించి పెన్షన్ ప్రకటించాలి



- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పెన్షన్ ప్రకటించాలి
- ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు రామారావు డిమాండ్

**కరీంనగర్, ఆగస్టు 10(సింగిడి):** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారికి సైనిక్ సమ్మాన్ తరహాలో పెన్షన్ ప్రకటించి గౌరవించాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉద్యమ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1969 నుంచి 2013 వరకు 45 ఏళ్ల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారని గుర్తుచేశారు. లాఠీ దెబ్బలు తిని, జైలు జీవితం గడిపిన ఉద్యమకారుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని పేర్కొన్నారు. ఉద్యమకారులకు నెలకు రూ. 12 వేల పెన్షన్‌తో పాటు రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. వారి కుటుంబాలకు ఉచిత కార్పొరేట్ వైద్యం, కుటుంబంలో ఒకరికి వయోపరిమితి లేకుండా ప్రభుత్వ ఉద్యోగం, 200 గజాల ఇంటి స్థలంలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వ రంగ సంస్థల నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 15న కరీంనగర్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి ఉద్యమ కారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పోలాడి రామారావు తెలిపారు. సమావేశంలో ఉద్యమకారులు కొత్తకొండ రవీందర్‌రావు, శ్రీపాద సత్యనారాయణ, దేవుళ్లపల్లి రామమూర్తి, బోయినపల్లి శ్రీనివాస్‌రావు, పెంచాల రంగయ్య, జన్ను జయరాజ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంటలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**జమ్మికుంట, ఆగస్టు 10 (సింగిడి):** దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ భారతీయ జనతా పార్టీ ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని భారత్ మాతాకీ జై, వందే మాతరం అంటూ దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గుత్తికొండ రాంబాబు మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, అఖండత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోగుత్తికొండ రాంబాబు ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్,మట్ట పవన్ రెడ్డి, ఏనుగు సురేందర్ రెడ్డి, తుపాకుల సతీష్, ఉప్పు దుర్గయ్య, సోమిడి సురేందర్, చింతల ఐలయ్య, సామల కర్ణాకర్ రెడ్డి, జిల్లెల శ్రీపాల్ రెడ్డి, మద్దూరి మల్లేష్, అసాలా సుధాకర్,చదువు సాయి రెడ్డి, చిట్ల శ్రీనివాస్, మురహరి గోపాల్, రావుల అశోక్,ఎలేవెని శ్రీధర్,పిట్టల రాజు బోయిని శివకృష్ణ, చిలుక రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దుబ్బ మల్లన్న ఆలయాన్ని సందర్శించిన ఎండోమెంట్ అధికారులు


**ఆలయ అభివృద్ధి పనులు పరిశీలన**



**జమ్మికుంట, ఆగస్టు 10 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో గల అతి పురాతనమైన శ్రీ దుబ్బ మల్లన్న దేవస్థానాన్ని ఎండోమెంట్ అధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి ఆలయ అధికారులకు ఘన స్వాగతం పలికారు. అతి పురాతన దైవ క్షేత్రంగా పేరు పొందిన శ్రీ దుబ్బ మల్లన్న ఆలయ ప్రాంగణంలో గల పోచమ్మ గుడి ఎల్లమ్మ గుడి ల అభివృద్ధి కొరకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆలయ అభివృద్ధి పనుల లో భాగంగా కామన్ గుడ్ నిధులనుండి అభివృద్ధి పనులు చేయుటకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న వివిధ పనులకు ఎండోమెంట్ అధికారులు కొలతలు వేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈవో సుభద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో ఆలయాలకు మహర్దశ పడుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని పలు ఆలయాల పై ప్రత్యేక చొరవ చూపెడుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో దుబ్బ మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక వసతులు కల్పించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్య బిక్షపతి రెండవ వార్డ్ కౌన్సిలర్ పోల్సాని శిల్ప వేణు రావు మాజీ కౌన్సిలర్ రావికంటి రాజకుమార్ ఎండోమెంట్ ఏఈ సంతోష్ రెడ్డి టెక్నికల్ ఇంజనీర్ ప్రమోద్ పటేల్ అసిస్టెంట్ స్థాపతి వెంకటేశ్వర్లు ఆలయ ఈవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- సభాస్థలి, హెలిపాడ్‌ను పరిశీలించిన జగ్గారెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్,



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 10 (సింగిడి):** ఈ నెల 15వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి కి రానున్నారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి లో అధికారికంగా ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌ను, అంబేద్కర్ స్టేడియంలోని బహిరంగ సభ స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి పరిశీలించారు. అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఇది ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంగారెడ్డి గడ్డపై ఘన స్వాగతం పలుకుతామని జగ్గారెడ్డి తెలిపారు. సుమారు 50 వేల మంది జనసమీకరణతో ఈ బహిరంగ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## ఘనంగా సాగర్, రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు



**కాల్వ శ్రీరాం పూర్,ఆగస్ట్ 10(సింగిడి):** కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఇప్పలపల్లి మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు వడ్లూరి సాగర్, గంగారం గ్రామానికి చెందిన వీరగోని రమేష్ గౌడ్ జన్మదిన వేడుకలు అభిమానులు, మిత్రుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జెక్కె రవీందర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ దాగేటి రామచంద్రం, బిల్డర్ల సంఘం నాయకుడు కాసర్ల శ్రీనివాస్, జర్నలిస్టులు, అభిమానులు, మిత్రులు తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## బోర్లగూడెం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

**మంత్రికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్**
**రూ.4.50 కోట్లతో డబుల్ రోడ్డు, 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి**



**మహాముత్తారం, ఆగస్టు 10 (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తార మండలం బోర్లగూడెం గ్రామపంచాయతీ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని కోరుతూ బోర్లగూడెం సర్పంచ్ అజ్మీరా ధరంసింగ్ నాయక్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. బోర్లగూడెం బస్టాండ్ నుంచి నర్సింగాపూర్ బస్టాండ్ వరకు రూ. 4.50 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కాంపౌండ్ వాల్, పాఠశాల నుంచి ఆర్అండ్‌బీ రోడ్డు వరకు సైడ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అంగన్‌వాడీ కేంద్రం–1కు నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. బోర్లగూడెంలో తొలి, రెండో విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని, గ్రామంలోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో పలువురు పూరి గుడిసెల్లో, పాలిథిన్ కవర్ల కింద నివసిస్తున్నారని ధరంసింగ్ నాయక్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి 100 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

## అమ్మవారికి బోనం సమర్పించిన శశిధర్ రెడ్డి దంపతులు



**అమీన్‌పూర్,ఆగస్ట్ 10 (సింగిడి):** ఎస్ఎల్ఎన్ హోమ్స్‌లో నిర్వహించిన బోనాల వేడుకల్లో అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, ఆయన సతీమణి, మాజీ కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి పాల్గొన్నారు. కాలనీవాసులతో కలిసి అమ్మ వారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- డీసీసీ భవన్‌లో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హన్మకొండ, ఆగస్టు 10 (సింగిడి):** దేశ యువతపైనే ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హనుమకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశ్విన్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యులు కేఆర్ నాగరాజు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని పిలుపునిచ్చారు. దేశ భవిష్యత్తును నిర్మించడంలో యువత పాత్ర అత్యంత కీలకమని, కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ యువతకు ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, యూత్ కాంగ్రెస్ నాయకులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఇంచార్జ్ రోషిణి జైస్వాల్ , యువజన నాయకులు కార్తీక్,హర్ష,రోషన్, తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్




**హన్మకొండ, ఆగస్టు 10 (సింగిడి):** ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమకొండలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో ఉన్న తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా స్వాగతం పలికారు.

## యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ ఆగస్టు 10 (సింగిడి):** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ చౌక్ నందు మిర్యాలగూడ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిట్టపల్లి వెంకటేష్ యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాస్వామ్య విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. యువతకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక సేవా రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు ఐకమత్యంతో ప్రజా సమస్యలపై పోరాడుతూ, యువత మరియు ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షులు షేక్ హాజరుద్దీన్ గారు, కాంగ్రెస్ నాయకులు చిలుకూరి బాలకృష్ణ , నూకల వేణుగోపాల్ రెడ్డి , పట్టణ అధ్యక్షులు మోయిజ్ , కోడిరెక్క ఇంద్ర కుమార్ , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



**హన్మకొండ , ఆగస్టు 10 (సింగిడి):** వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదివారం శ్రీ భద్రకాళి దర్శించుకొని పూజలు నిర్వహించారు. పూజానంతరం అర్చకులు సత్యం మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదా లను అందజేశారు.

## బీఎస్పీ నల్గొండ జిల్లా పార్లమెంట్ ఇంచార్జిగా నల్ల ప్రసాద్



**చింతపల్లి, ఆగస్టు 10 (సింగిడి):** బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నల్గొండ జిల్లా పార్లమెంట్ ఇంచార్జిగా నల్ల ప్రసాద్ ను నియమిస్తూ బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన నల్ల ప్రసాద్ మాట్లాడుతూ బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్ నాయకత్వంలో రాష్ట్రంలోని బహుజన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. బహుజనులకు సామాజిక, రాజకీయ న్యాయం అందించడంతో పాటు అంతిమంగా రాజ్యాధికార సాధనే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తనపై నమ్మకంతో నల్గొండ జిల్లా పార్లమెంట్ ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రామ్ శేఖర్, జిల్లా అధ్యక్షుడు రవి శంకర్ లకు నల్ల ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తల సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

# ఏళ్ల నిరీక్షణకు తెర.. పేదల సొంతింటి కల సాకారం

- 548 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ
- మౌలిక వసతులు కల్పించి ఇళ్లను అందుబాటులోకి తెచ్చాం
- ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**కోదాడ, ఆగస్టు 10 (సింగిడి):** ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాల నిరీక్షణకు తెరపడింది. కోదాడ బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి 548 మంది లబ్ధిదారులకు ఆదివారం పట్టాలు పంపిణీ చేశారు. పట్టణంలోని పెరిక హాస్టల్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి లబ్ధిదారులకు స్వయంగా పట్టాలను అందజేశారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.

**మౌలిక వసతులు కల్పించాం... ఎమ్మెల్యే...**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇళ్లు నిర్మించడం మాత్రమే కాకుండా వాటిలో ప్రజలు సౌకర్యవంతంగా జీవించేలా విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు నిర్మించినప్పటికీ మౌలిక వసతులు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలను గుర్తించి అవసరమైన సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.

**పేదల సంక్షేమానికి ప్రాధాన్యం**

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సొంత ఇల్లు కల్పించడం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాతో పాటు సామాజిక గౌరవం లభిస్తుందని అన్నారు.



**లబ్ధిదారుల ఆనందం**

ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూశామని, ఎట్టకేలకు పట్టాలు అందడంతో తమ కల నెరవేరిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించినా మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం విద్యుత్, నీరు, రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి ఇళ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళా లబ్ధిదారులు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిని ఆప్యాయంగా కౌగిలించుకుని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని వెంకటరత్నం బాబు, వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి, ఆర్డీవో సూర్యనారాయణ, టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఎమ్మార్వో సంతోష్ కిరణ్, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


- మంగపేటలో ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**ములుగు జిల్లా ప్రతినిధి, ఆగస్టు 10 (సింగిడి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో ఆదివాసీ నాయకులు జెండాలు ఎగురవేసి దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి ఆదివాసీ గ్రామ పెద్దలు, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, ఆదివాసీ ప్రజలు బోరు నర్సాపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి మంగపేట మండల కేంద్రంలోని కొమరం భీమ్ విగ్రహం వరకు సంప్రదాయ నృత్యాలు, నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. మంగపేటలోని అంబేద్కర్, కొమరం భీమ్ విగ్రహాలకు ఆదివాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీ జెండాను ఎగురవేసి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఎందరో మహనీయులు త్యాగాలు చేశారని గుర్తుచేశారు. ఆదివాసీ సమాజం తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గొప్ప వీరయ్య, గొప్ప సమ్మారావు, పొదెం కృష్ణప్రసాద్, కొండా చెంచయ్య, కబ్బాక శ్రావణ్, నల్లబోయిన లక్ష్మణ్ దొర, అయ్యోరి యానయ్య, మద్దెల అంజయ్య, తాటి నాగరాజు, జబ్బ రవి, పొదెం రవీందర్, ఎట్టి సారయ్య, బాడిశ నాగరమేష్, పొదెం మేనక, డబ్బుల ముత్యాలరావు, చాద మల్లయ్య, తల్లడి నాగేశ్వరరావు, సోయం ఈశ్వర్, తోలేం రామకృష్ణ, కొంచెం మొగిలి, తోలేం నరసింహారావు, కోరెం శ్రీను, పూనెం రాములు, కొమరం రవి, పూనెం ప్రశాంత్, కుర్సం రమేష్, పొదెం నాగేష్, ఆక తిరుమలరావు, కొమరం లక్ష్మీపతి, కబ్బాక లక్ష్మణ్, కొమరం సారన్న, కొమరం బాలన్న, ఇరప అరుణ, తోలేం సౌమ్య, వాగబోయిన లావణ్య, పుసాం సావిత్రి, ఇరప రజిని, మద్దెల నాగేశ్వరరావు, జోగ నరేందర్, ముక్తి రవి తదితరులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు మైల జయరాం రెడ్డి, చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, ఎల్పీ ముత్యాలు, పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ల సురేష్, మురుకుట్ల నరేందర్, ఎంపెల్లి వీరాస్వామి తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు.

# యూత్ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలి


- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**భూపాలపల్లి, ఆగస్టు 10 (సింగిడి):** యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అంబేద్కర్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతున్న సంస్థ యూత్ కాంగ్రెస్ అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువతకు సమాన అవకాశాల కోసం యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యువత ఐక్యంగా ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో క్రియాశీల భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాలని సూచించారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి యువ కాంగ్రెస్ కార్యకర్తకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అధ్యక్షులు బట్టు కర్ణాకర్ , పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణకు కొమరం భీమ్ ఆశయాలే స్ఫూర్తి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**భూపాలపల్లి, ఆగస్టు 10 (సింగిడి):** ప్రపంచ ఆదివాసీల ( గిరిజనుల)హక్కుల దినోత్సవం సందర్భంగా భూపాలపల్లి లోని కొమరం భీమ్ విగ్రహానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్--జంగల్--జమీన్ పరిరక్షణ కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఆదివాసీ ప్రజల భూమి, అటవీ సంపదపై వారికి హక్కు ఉండాలని, వారి జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షించబడాలని కొమరం భీమ్ పోరాటం చేశారని గుర్తు చేశారు. కొమరం భీమ్ ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ సోదరుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆదివాసీ కుటుంబాల అభివృద్ధి, విద్య, ఉపాధి, సంక్షేమం మరియు వారికి రాజ్యాంగబద్ధంగా లభిస్తున్న హక్కులను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా వారిని సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఆదివాసీ సమాజం తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే విద్య, ఉద్యోగ, రాజకీయ మరియు సామాజిక రంగాల్లో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కొమరం భీమ్ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడే స్ఫూర్తిని నేటి తరం ఆదివాసీ యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆదివాసీ యువత, ఆదివాసీ బిడ్డలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాన్‌షాప్‌ల సంఘం అధ్యక్షుడిగా శ్రీరాముల నవీన్



**జమ్మికుంట, ఆగస్టు 10 (సింగిడి) :** జమ్మికుంట పట్టణ పాన్ షాప్ ల సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కృష్ణా పాన్ షాప్ యజమాని శ్రీరాముల నవీన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అపర భద్రాద్రిగా పేరుపొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో పాన్ షాప్ యజమానులు అందరు కలిసి నవీన్ ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా రావుల అనిల్ కోశాధికారిగా ఎండి రఫీక్ సలహాదారుగా కట్కూరి వెంకన్నను సభ్యులు అనుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 38 మంది షాపుల యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో పాన్ షాప్ ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నుకున్న సహచర మిత్రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని భవిష్యత్తులో సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడతానని సంఘం సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. అనంతరం నూతన అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తాం



**మిర్యాలగూడ, ఆగస్టు 10 (సింగిడి):** కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించామని సిపిఐ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారంఆగస్టు 6 నుండి 14 వరకు పాదయాత్రలు ప్రచార యాత్రలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తా ఉన్నారు మిర్యాలగూడ జూనియర్ కాలేజీ గ్రౌండ్లో పాదాచారుల ను కలిసి వారికి కరపత్రాలు ఇచ్చుకుంటూ ప్రచారం చేయడం జరిగినది. మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పెరుగుతున్న నిత్యవసర సరుకులు డీజిల్ పెట్రోల్ గ్యాస్ ధరలను అరికట్టడంలో ఘోరంగా విఫలమైందని వారన్నారు ప్రతి యువకుడికి ఉద్యోగాలు కల్పిస్తానని మాయ మాటలు చెప్పి కల్పించకపోవడం సార్వత్రిక విద్య ఆరోగ్యం అందుబాటులోకి తేవాలని రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధరలు చట్టబద్ధత కల్పించాలని మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలని రైతుల కార్మికుల హక్కుల పరిరక్షించాలని ఈ దేశంలో బ్యాలెట్ పేపర్ ద్వారాఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని దళిత ఆదివాసులపై జరుగుతున్న దాడులను నిలిపివేయాలని వారన్నారు ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజన పెల్లి రామలింగం జిల్లా యాదగిరి పోలేపల్లి విజయ్ కుమార్ వేణుగోపాల్ రెడ్డి గారు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్ ధోనేటి వెంకన్న కార్తీక్ దర్శనం వినయ్ పోస్ట్ ఆఫీస్ రామయ్య గారు శ్రీనివాస్ నాగేందర్ రవి వినయ్ దేవేందర్ ఎగ్బాల్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సాయి సన్నిధిలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**చింతపల్లి, ఆగస్టు 10 (సింగిడి):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయి బాబా వారి ఆశీస్సులు పొందారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్ హనుమంతరావుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రోచ్చారణల మధ్య శాలువాతో ఘనంగా సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి వేద ఆశీర్వచనం పలికారు. ఆలయ పూజారులు సాయి బాబా వారి తీర్థప్రసాదాలను కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ సాయి సన్నిధి ఆలయం ఆధ్యాత్మిక విశ్వాసానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఆలయాన్ని దర్శించుకోవడం పట్ల ఆలయ నిర్వాహకులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు తడకమళ్ళ శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నిఖిల్‌కు కాంస్య పతకం



**కాటారం, ఆగస్టు 10 (సింగిడి):** మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఇనుముల నిఖిల్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 7న హన్మకొండలో నిర్వహించిన 5వ తెలంగాణ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-8 బాలుర స్టాండింగ్ లాంగ్ జంప్ విభాగంలో నిఖిల్ తృతీయ స్థానంలో నిలిచి ఈ ఘనత సాధించాడు. చిన్న వయసులోనే రాష్ట్రస్థాయిలో పతకం సాధించడం పట్ల నిఖిల్‌ను జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ పంతకాని సమ్మయ్య ఆధ్వర్యంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఘనంగా అభినందించారు. నిఖిల్‌ను శాలువాతో సత్కరించి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పంతకాని సమ్మయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా మంచి గుర్తింపుతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో కాటారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూతల సమ్మయ్య, విద్యాసంస్థల చైర్మన్ జనగామ కరుణాకర్‌రావు, నాయకులు కుంభం స్వప్న, సుజాత, ఆత్మకూరి కుమార్, రాము, భూమయ్య, చంద్రమౌళి, కోచ్‌లు లక్ష్మణ్, కార్తీక్, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో కాలనీకి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతా..

ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ, ఆగస్టు 10 (సింగిడి):** వర్ధన్నపేట నియోజకవర్గంలోని 56వ డివిజన్ టీఎన్జీవో కాలనీ ప్రధాన ముఖః ద్వార నిర్మాణ పనులను వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదివారం కొబ్బరికాయకొట్టి పనులను ప్రారంభించారు. నగరంలోనే టీఎన్జీవో కాలనీకి ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ అధ్యక్షులు కొంకా హరిబాబు, ఏనుమాముల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందుకూరి పూర్ణచందర్,సీనియర్ నాయకులు కె ఆర్ కృష్ణమూర్తి,మద్రి ప్రభాకర్,మహిళా అధ్యక్షురాలు శనిగరపు అనిత,యూత్ నాయకులు బూర్ల శ్రీను మరియు టీఎన్జీవో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఫిట్‌నెస్, వెయిట్ లాస్ కోసం
# భోజనం మానేస్తున్నారా?





చాలామంది ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభించగానే త్వరగా బరువు తగ్గాలనే ఆత్రుతతో భోజనం మానేయడం లేదా తక్కువ తినడం వంటి మార్గాలను ఎంచుకుంటారు. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం, లంచ్ ఆలస్యం చేయడం లేదా కేవలం కాఫీలతో రోజు గడిపేయడం వంటి అలవాట్లు ఫిట్‌నెస్‌కు దారితీయకపోగా, మీ ఆరోగ్య పురోగతిని మరింత మందగింపజేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఫిట్‌నెస్ నిపుణురాలు దీప్తి శర్మ సూచనల ప్రకారం, బరువు తగ్గడం అనేది కేవలం జిమ్‌లో కష్టపడటంపైనే కాకుండా, సరైన పోషకాహారం, నిద్ర, ఒత్తిడి నిర్వహణ మరియు శారీరక రికవరీపై ఆధారపడి ఉంటుంది.

**అతిగా తినే ప్రమాదం..**

పగటిపూట భోజనం మానేసే వారు సాయంత్రం వేళల్లో విపరీతమైన ఆకలికి గురవుతారు. దీనివల్ల రాత్రిపూట నియంత్రణ కోల్పోయి అతిగా తినడం లేదా అనారోగ్యకరమైన ఫాస్ట్ ఫుడ్స్ వైపు మొగ్గు చూపడం జరుగుతుంది. ఈ క్రమరహిత ఈటింగ్ ప్యాటర్న్ మీ జీర్ణవ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుంది. ఫిట్‌నెస్‌ను సాధించాలంటే పస్తులుండటం పరిష్కారం కాదు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలే కీలకం.

భోజనం మానేయడానికి బదులుగా, ప్రోటీన్, ఫైబర్ (పీచు పదార్థం), ఆరోగ్యకరమైన కొవ్వులు మరియు సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు కలిగిన సమతుల్య ఆహారాన్ని నిర్ణీత సమయాల్లో చిన్న చిన్న భాగాలుగా తీసుకోవాలి. ఇవి రోజంతా శక్తిని స్థిరంగా ఉంచి, మీ వర్కౌట్ పనితీరును మెరుగుపరుస్తాయి. క్రాష్ డైట్లు, డిటాక్స్ టీల వంటి తాత్కాలిక పద్ధతుల కంటే, దీర్ఘకాలంలో శరీరం బలంగా, ఆరోగ్యంగా మారేలా పౌష్టికాహారాన్ని అందించడమే అసలైన ఫిట్‌నెస్. సరైన పోషకాహారం, నిలకడైన జీవనశైలితోనే మీరు కోరుకున్న ఆరోగ్యకరమైన ఫిట్‌నెస్‌ను పొందగలరు. ఆకలిని నియంత్రించడం అంటే మానేయడం కాదు, శరీరానికి అవసరమైన ఇంధనాన్ని సరైన సమయంలో అందించడమేనని గుర్తుంచుకోండి.

### మర్చిపోకుండా
# రోజుకో చిలగడదుంప..

ఈ ఐదు అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతం!



**రోడ్డు పక్కన, కూరగాయల మార్కెట్లో ఎక్కువగా లభించే దుంపలలో చిలగడదుంప ఒకటి. దీనిని గెనుసు గడ్డ లేదా మోరం గడ్డ అని కూడా పిలుస్తారు. తీపి రుచిని కలిగి ఉండే ఈ దుంపలను ఉడకబెట్టుకుని లేదా కాల్చుకుని తింటుంటారు. అయితే, చాలా మంది దీనిని ఒక సాధారణ దుంపలా భావించి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వరు. కానీ, పోషకాహార నిపుణుల ప్రకారం చిలగడదుంప ఒక అద్భుతమైన సూపర్‌ఫుడ్. ప్రతిరోజూ మన డైట్‌లో చిలగడదుంపలను భాగం చేసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అందుతాయి. ఇందులో దాగి ఉన్న ఆరోగ్య ప్రయోజనాలేంటో ఇప్పుడు చూద్దాం.**

కంటి చూపును మెరుగుపరుస్తుంది: చిలగడదుంపలలో బీటా-కెరోటిన్ అనే యాంటీఆక్సిడెంట్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది మన శరీరంలోకి వెళ్లిన తర్వాత విటమిన్-ఎ గా మారుతుంది. విటమిన్-ఎ కంటి చూపును మెరుగుపరచడానికి, వృద్ధాప్యం వల్ల వచ్చే కంటి సమస్యలను, రేచీకటిని నివారించడానికి కీలక పాత్ర పోషిస్తుంది.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది: ఇందులో విటమిన్-సి మరియు ఇతర యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, వ్యాధి నిరోధక శక్తిని బలపరుస్తాయి. దీనివల్ల సీజనల్ ఇన్ఫెక్షన్లు, జలుబు, దగ్గు వంటి సమస్యలు దరిచేరవు.

జీర్ణక్రియకు ఎంతో మేలు: చిలగడదుంపలలో ఫైబర్ (పీచు పదార్థం) అధికంగా ఉంటుంది. ఇది ప్రేగుల కదలికలను సులభతరం చేసి, తీవ్రమైన మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను దూరం చేయడంలో ఇది అద్భుతంగా సహాయపడుతుంది.

**గుండె ఆరోగ్యం, రక్తపోటు నియంత్రణ:**
ఇందులో పొటాషియం మోతాదు ఎక్కువగా ఉంటుంది. పొటాషియం శరీరంలోని అదనపు సోడియం ప్రభావాన్ని తగ్గించి, రక్తపోటును అదుపులో ఉంచుతుంది. తద్వారా గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది.

**డయాబెటిస్ నియంత్రణ:**
చిలగడదుంప తీపిగా ఉన్నప్పటికీ, దీని గ్లైసిమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. ఇందులోని ఫైబర్ కారణంగా ఇది రక్తంలో చక్కెర స్థాయిలను ఒకేసారి పెంచకుండా, స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది. కాబట్టి మధుమేహం ఉన్నవారు కూడా దీనిని పరిమితంగా తీసుకోవచ్చు.

చిలగడదుంపలను నూనెలో వేయించి చిప్స్ లాగా కాకుండా.. ఆవిరిపై ఉడికించి లేదా బేక్ చేసి తీసుకోవడం వల్ల అందే పోషకాలు పూర్తిగా అందుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి, పిల్లల ఎదుగుదలకు ఇది ఒక పరిపూర్ణమైన పౌష్టికాహారం.



### ఐస్‌క్రీమ్ అంటే
# అంత ఇష్టమా?

### మీరు తింటున్నది నిజమైన ఐస్‌క్రీమా? కాదా?





ఐస్ క్రీమ్, ఫ్రోజన్ డెజర్ట్స్ మధ్య ప్రధాన వ్యత్యాసం వాటిలో ఉండే కొవ్వు పదార్థం యొక్క మూలం. నిజమైన ఐస్ క్రీమ్‌ను పాలు, క్రీమ్ వంటి పాల ఉత్పత్తుల నుండి సేకరించిన 'మిల్క్ ఫ్యాట్' తో తయారు చేస్తారు. దీనికి భిన్నంగా, ఫ్రోజన్ డెజర్ట్‌లలో మిల్క్ ఫ్యాట్‌కు బదులుగా పామ్ ఆయిల్ లేదా ఇతర వృక్ష సంబంధిత నూనెలను ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆహార నియంత్రణ నిబంధనల ప్రకారం, ఐస్ క్రీమ్ అని పిలవబడాలంటే కనీస మొత్తంలో పాల కొవ్వు, ఘన పదార్థాలు ఉండాలి. ఈ నిబంధనలకు లోబడని ఉత్పత్తులను ఐస్ క్రీమ్‌గా అమ్మడానికి వీల్లేదు, అందుకే వాటిని 'ఫ్రోజన్ డెజర్ట్స్' అని లేబుల్ చేస్తారు.

**తయారీ విధానం**

ఐస్ క్రీమ్ దాని సహజ సిద్ధమైన పాల కొవ్వు వల్ల రిచ్‌గా, క్రీమీగా ఉంటుంది. ఇది నోట్లో వేసుకోగానే కరిగే విధానం చాలా భిన్నంగా ఉంటుంది. ఫ్రోజన్ డెజర్ట్స్ మరింత మెత్తగా, స్మూత్‌గా ఉండటం కోసం తయారీదారులు అందులో ఎమల్సిఫైయర్స్, స్టెబిలైజర్స్, గమ్స్ మరియు కృత్రిమ రంగులు, ఫ్లేవర్లను కలుపుతారు. ఐస్ క్రీమ్‌లో పాలు, క్రీమ్, పంచదార ప్రధానంగా ఉంటే, ఫ్రోజన్ డెజర్ట్స్‌లో వెజిటబుల్ ఆయిల్స్, కార్న్ సిరప్, వే వంటి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

ఫ్రోజన్ డెజర్ట్ అంటే నాణ్యత తక్కువ అని కాదు, అవి వేర్వేరు ధరల శ్రేణులకు, రుచి ప్రాధాన్య తలకు అనుగుణంగా తయారు చేయబడతాయి. ఐస్ క్రీమ్ క్లాసిక్ రుచిని అందిస్తే, ఫ్రోజన్ డెజర్ట్స్ స్మూత్ టెక్స్చర్‌ను అందిస్తాయి. తదుపరిసారి మీరు ఫ్రీజర్ దగ్గర ఐస్ క్రీమ్ తీసుకునేటప్పుడు, ప్యాకెట్ మీద ఉన్న పదార్థాల జాబితాను ఒకసారి జాగ్రత్తగా చూడండి. మీరు తీసుకునే పదార్థాల గురించి మీకు అవగాహన ఉండటం, మిమ్మల్ని ఒక తెలివైన వినియోగదారుడిగా మారుస్తుంది. ఏది ఏమైనా, అతి ఏదైనా ఆరోగ్యానికి హానికరమే, కాబట్టి పరిమితంగా తీసుకుంటూ ఆస్వాదించండి!

### మేరు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి
# నిధులు కేటాయించాలి..

### టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించిన మేరు సంఘం రాష్ట్ర నాయకులు



**హైదరాబాద్ బ్యూరో, (సింగిడి):** మేరు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మేరు ఆత్మ గౌరవ భవన ట్రస్ట్ చైర్మన్ కొవ్వూరు భాస్కర్ రావు తదితరులతో కూడిన ప్రతినిధి బృందం టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ ను కోరారు. బుధవారం మహేష్ కుమార్ గౌడ్ ను గాంధీ భవన్ లో మేరు సంఘం ట్రస్ట్ చైర్మన్ పొడిశెట్టి నర్సింగ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మేరు సంఘం రాష్ట్ర నాయకులు కె.వెంకటేష్, దీకొండ నర్సింగ్ రావు, తాళ్ళ వెంకటేశ్వరరావు, యస్.బి.సంగె వార్, దీకొండ శ్రీనివాస్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛన్ని అందజేసారు. ఈ సందర్భంగా వారు మహేష్ కుమార్ గౌడ్ కు వినతి పత్రం సమర్పించారు. మేరు ఆత్మ గౌరవ భనం కోసం ఉప్పల్ భగాయత్ లో కేటాయించిన ఒక ఎకరం స్థలంలో మేరు సామాజిక,ఆర్థిక, విద్య, సాంస్కృతిక వికాసం,యువత, మహిళల ఉపాధి శిక్షణ నైపుణ్యానికి కేం కేంద్రంగా విలసిల్లే మేరు ఆత్మ గౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయింపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లాలని కోరారు.బీసీల ఆత్మ గౌరవ భవన నిర్మాణాలకు బడ్జెట్ కేటాయింపు విషయం ప్రభుత్వం దృష్టిలో ఉన్నదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఎంజీ సికింద్రాబాద్‌లో ఘనంగా ఆవిష్కరించిన సరికొత్త ఎంజీ మాజెస్టర్



**హైదరాబాద్ బ్యూరో (సింగిడి):** ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎంజీ (మోరిస్ గ్యారేజెస్) తన అత్యాధునిక ప్రీమియం ఎస్‌యూవీ ఎంజీ మాజెస్టర్ ను వైబ్రెంట్ మొబిలిటీ ఆధ్వర్యంలో ఎంజీ సికింద్రాబాద్ షోరూమ్‌లో ఘనంగా ఆవిష్కరించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ముఖ్య అతిథిగా హాజరై వాహనాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంజీ ప్రతినిధులు బషీర్ బాబు ఖాన్, సిరాజ్ బాబుఖాన్ మీడియాతో మాట్లాడుతూ, ఎంజీ మాజెస్టర్‌లో పొందుపరిచిన ఆధునిక సాంకేతికత, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, ప్రీమియం డిజైన్, సౌకర్యవంతమైన ఫీచర్ల గురించి వివరించారు.భారతీయ వినియోగదారుల అభిరుచు లకు అనుగుణంగా రూపొందించిన ఎంజీ మాజెస్టర్ ఆటోమొబైల్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఆటోమొబైల్ రంగ ప్రముఖులు, వినియోగదారులు పాల్గొన్నారు.


### ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు యూజర్లకు షాక్..
## ఈ కార్డులపై రివార్డు పాయింట్ల కోత

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్డ్ క్రెడిట్ కార్డు వినియోగదారులకు అలర్ట్. ఫోన్‌పేతో కలిసి తీసుకొచ్చిన కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ ప్రోగ్రామ్‌లో ఎస్‌బీఐ కార్డ్ మార్పులు చేసింది. ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ పర్పుల్ , ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ సెలెక్ట్ బ్లాక్ రివార్డు పాయింట్లకు కొత్త పరిమితులను నిర్దేశించింది. జులై 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి రానున్నాయి.

**ఫోన్‌పే- ఎస్‌బీఐ పర్పుల్**

ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్ పర్పుల్‌కు సంబంధించి ఫోన్‌పే యాప్, ఆన్‌లైన్ చెల్లింపులకు సంబంధించి నెలవారీ రివార్డ్ పాయింట్ల గరిష్ఠ పరిమితిని తగ్గించారు. గతంలో ఫోన్‌పే ద్వారా చేసే ఖర్చులపై గరిష్ఠంగా 1000 పాయింట్లు, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై 1000 పాయింట్లు చొప్పున రివార్డు పాయింట్లు లభించేవి. కొత్తగా ఫోన్‌పేలో ఖర్చులను రెండు కేటగిరీలుగా విభజించారు. ఇన్సూరెన్స్ బిల్లు పేమెంట్లపై నెలకు గరిష్ఠంగా 250 పాయింట్లు మాత్రమే చెల్లించనున్నారు. ఇతర లావాదేవీలకు 750 పాయింట్లు లభిస్తాయి. ఆన్‌లైన్ ఖర్చులపై చెల్లించే రివార్డు పాయింట్లను వెయ్యి నుంచి 750కి కుదించారు.

### ఏఐ బూమ్‌తో
# ఆ ఉద్యోగాలకు కాసుల పంట.. ప్యాకేజీ రూ.1.85 కోట్లు..!



కృత్రిమ మేధ రాకతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు ఎంతోకాలంగా ఉన్నాయి. అందుకు తగినట్లుగానే పలు కంపెనీలు లేఆఫ్‌లు ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఓ రంగానికి మాత్రం ఇటీవలి కాలంలో విపరీతమైన డిమాండ్ పెరిగింది. అదే డేటా సెంటర్లకు భద్రత కల్పించే విభాగం. ఇందులో కొన్ని రోల్స్‌కు ఆయా కంపెనీలు ఏకంగా రూ.1.85కోట్లు వార్షిక ప్యాకేజీగా చెల్లిస్తున్నాయట..!

ఏఐ మోడళ్లు, క్లౌడ్ సర్వీసులను నడిపేందుకు అవసరమైన మౌలిక వసతుల కోసం కంపెనీలు బిలియన్ డాలర్ల కొద్దీ వెచ్చిస్తున్నాయి. ఇందులో డేటా సెంటర్లు కూడా ఒకటి. అయితే, కొంతకాలంగా ఈ మౌలిక సదుపాయాలకు పలు రకాలుగా ముప్పు ఎదురవుతోంది. చోరీలు, చొరబాట్లతో పాటు, గూఢచర్యం, డ్రోన్ దాడులు వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా – ఇరాన్ పరిస్థితులే అందుకు ఉదాహరణ. ఇటీవల పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన పలు క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్లు, డేటా సెంటర్లను ఇరాన్ లక్ష్యంగా చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే వీటి రక్షణ కోసం కంపెనీలు స్పెషలిస్టులను నియమించుకుంటున్నాయి.

ఓఎస్ యుగం ముగిసింది.. ఇది 'ఏజెంట్స్' శకం : సత్య నాదెళ్ల

డేటా సెంటర్ల భద్రతకు సంబంధించిన విభాగాల్లో నియామకాలు గత ఐదేళ్లలో నాలుగు రెట్లు పెరిగినట్లు తెలుస్తోంది. వీటిల్లో డేటా సెంటర్ల వద్ద భద్రతా ప్రమాణాలను నిర్ధరించడం, ముప్పులను ముందే అంచనా వేసి, వాటిని అడ్డుకునే విధంగా ఏర్పాట్లు చేయడం వంటి ఉద్యోగాలున్నాయి. ఈ పోస్టులకు ఆకర్షణీయమైన వేతనంతో పాటు పలు మెడికల్ ఇన్సూరెన్స్, డెంటల్, విజన్ ఇన్సూరెన్స్, పితృత్వ సెలవులు, భోజన వసతి వంటి అదనపు ప్రయోజనాలు కూడా కల్పిస్తున్నారు. ఈ రోల్స్‌కు బేసిక్ ప్యాకేజీ 1.43లక్షల డాలర్ల నుంచి 1.91లక్షల డాలర్ల వరకు ఉంటోంది. అంటే భారత కరెన్సీలో రూ.1.38కోట్ల నుంచి రూ.1.85కోట్ల ప్యాకేజీ చెల్లిస్తున్నారన్నమాట..!

ఇదిలా ఉండగా.. భారత్‌లోనూ డేటా సెంటర్ల పరిశ్రమ వేగంగా వృద్ధి చెందుతోంది. 2019లో వీటి సామర్థ్యం 350 మెగావాట్లు ఉండగా.. గతేడాది నాటికి అది 1.5-1.6గిగావాట్లకు పెరిగింది. దీంతో దేశంలో ఇండస్ట్రీ పరికరాల తయారీ సంస్థలకు గిరాకీ లభిస్తోందని నోమురా తెలిపింది. డేటా సెంటర్ల వృద్ధితో ఈ తయారీదారులకు 35 బిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలు లభించనున్నట్లు అంచనా వేసింది.




### బీసీ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల
### బ్యాక్‌లాగ్ రెండవ దశ
# సీట్ల జాబితా విడుదల

### ఇంటర్ ఫస్ట్ లిస్ట్ లో సీట్లు వచ్చిన విద్యార్థులు 4వ తేదీలోగా రిపోర్ట్ చేయాలి
### - ఎం జె పి ఇన్ ఛార్జ్ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

హైదరాబాద్ బ్యూరో జూన్ 3 నినాదం :మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 6, 7, 8 , 9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల రెండో జాబితా ఈ రోజు (జూన్3) విడుదల చేశామని సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు(వట ఏ సి ) తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్లు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఫలితాలను సొసైటీ అధికారిక వెబ్ సైట్ లో పరిశీలించవచ్చు అని ఆయన పేర్కొన్నారు.
ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారని, విద్యార్థులు ఏ తేదీన పాఠశాలకు హాజరు కావాలి అన్న వివరాలు తెలియ చేస్తారని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మెరిట్ లిస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. సీట్ల కేటాయింపు,భర్తీ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది అని ఆయన తెలిపారు.బీసీ గురుకుల ఇంటర్ కోర్సుల్లో ఫస్ట్ లిస్ట్ లో సీట్లు వచ్చిన విద్యార్థులు ఈనెల 4వ తేదీ లోగా సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాలని డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు.

### ఎస్‌బీఐలో రూ.3,00,000 డిపాజిట్ చేస్తే
# ఎంత వడ్డీ వస్తుందో తెలిస్తే షాకవుతారు..!

**దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ), తన వినియోగదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డి)పై ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తోంది. వినియోగదారులు ఈ బ్యాంకులో కేవలం 7 రోజుల నుండి 10 సంవత్సరాల వరకు కాలపరిమితితో ఫిక్స్‌డ్ డిపాజిట్లను తెరవవచ్చు. ఎస్‌బిఐ ఒక ప్రభుత్వ రంగ బ్యాంకు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్నందున, దాని వివిధ ఎఫ్‌డి పథకాలలో పెట్టుబడి పెట్టడం హామీతో కూడిన రాబడిని అందిస్తుంది.**




ఒక వ్యక్తి ఏదైనా నిర్దిష్ట ఎస్‌బిఐ ఎఫ్‌డి పథకంలో రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ సమయంలో వారు సుమారుగా రూ.1,58,974 స్థిర వడ్డీని సంపాదించవచ్చు. అందుకే సురక్షితమైన పెట్టుబడులు, హామీతో కూడిన ఆదాయం కోరుకునే వారు ఎస్‌బిఐ ఎఫ్‌డిలను ఒక నమ్మకమైన ఎంపికగా పరిగణిస్తారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ాదీ×) తన వినియోగదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఖీణల)పై అద్భుతమైన వడ్డీ రేట్లను అందిస్తోంది. ఈ బ్యాంకు వివిధ కాలపరిమితుల ఖీణ పథకాలపై కనిష్టంగా 3.05 శాతం నుండి గరిష్టంగా 7.15 శాతం వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. ఎస్‌బీఐ అతి తక్కువ కాలపరిమితి గల ఖీణ, అంటే 7 రోజుల ఖీణ, వినియోగదారులకు 3.05% నుండి 3.65% వరకు వడ్డీ రేటును అందిస్తుంది.

46 రోజుల నుండి 179 రోజుల కాలపరిమితి గల ఎఫ్‌డీలపై ఈ బ్యాంకు 4.90% నుండి 5.50% వరకు రాబడిని అందిస్తుంది. అంతేకాకుండా, 180 రోజుల నుండి 210 రోజుల కాలపరిమితి గల ఎఫ్‌డీలు వినియోగదారులకు 5.65% నుండి 6.25% వరకు వడ్డీ రేటును అందిస్తాయి. ఒకవేళ వినియోగదారుడు ఎక్కువ కాలం పాటు పెట్టుబడి పెట్టాలనుకుంటే, ాదీ× 5 నుండి 10 సంవత్సరాల ఎఫ్‌డీలు ఒక మంచి ఎంపిక కావచ్చు. ఈ కాలపరిమితిలో మెచ్యూర్ అయ్యే ఎఫ్‌డీలపై ఈ బ్యాంకు 6.05% నుండి గరిష్ఠంగా 7.15% వరకు వడ్డీ రేట్లను అందిస్తుంది. రూ.3,00,000 డిపాజిట్‌పై రూ.1,58,974 వరకు స్థిర వడ్డీ లభిస్తుంది.

ఒక సగటు పౌరుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6 సంవత్సరాల ఎఫ్‌డీ పథకంలో రూ.3 లక్షలు పెట్టుబడి పెడితే, మెచ్యూరిటీ సమయంలో వడ్డీతో కలిపి మొత్తం రూ.4,30,120 అందుకుంటారు. అంటే, వారు ఆరు సంవత్సరాలలో సుమారుగా రూ.1,30,120 వడ్డీని సంపాదిస్తారు. అదే సమయంలో ఒక సీనియర్ సిటిజన్ అదే పథకంలో రూ.3 లక్షలు డిపాజిట్ చేస్తే, మెచ్యూరిటీ సమయంలో వారు మొత్తం రూ.4,56,276 అందుకుంటారు.

ఇందులో రూ.1,56,276 కేవలం వడ్డీ మాత్రమే ఉంటుంది. అంతేకాకుండా ఈ పథకం ద్వారా అత్యంత సీనియర్ సిటిజన్లు ఎక్కువగా ప్రయోజనం పొందుతారు. రూ.3 లక్షల డిపాజిట్‌పై ఆరు సంవత్సరాల తర్వాత వారు మొత్తం రూ.4,58,974 సంపాదిస్తారు. అందులో రూ.1,58,974 వడ్డీ రూపంలో ఉంటుంది.

ప్రభాతవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం
11-8-2026

# వాడి వేడిగా మండల సర్వసభ్య సమావేశం

### సమస్యలపై అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు .. రైతుల సమస్యలు పరిష్కరించాలి.. ఎమ్మెల్యే

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్ట ణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం వాడి వేడిగా జరిగింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన పలువురు సర్పంచులు వ్యవసాయ అధికారులు రుణమాఫీ విషయం గురించి చదువుతుం డగా అందరికి రుణమాఫీ కాలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం డి ఎ పి కి యూరియా కి లింకు పెట్టవద్దని దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అదేవి ధంగా యూరియా యాప్ ను ఎత్తివేయాలని డిమాండ్ చేయడంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వ ర్యంలో సభ్యులందరూ దీన్ని తీర్మానం చేయాలని కోరారు. అదేవిధంగా తనుగుల గుంపుల గ్రామాల మధ్య ఉన్న చెక్ డాం కూలిపోయినప్పటికీ ఇప్పటికీ దానిని పూర్తి చేయకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని వెంటనే దానిని నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ ఏఈ అఖిలను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కోరారు. దీంతో పాటు వీణవంక మండలంలోని కల్వల ప్రాజెక్ట్ నిర్మాణం కూడా వేగవంతంగా చేపట్టాలని దాని ద్వారా జమ్మికుంట మండలంలోని దాదాపు 7 వేల నుంచి 8 వేల ఎకరాల రైతులకు సంబంధించిన భూమి నీటి ఎద్దడి లేకుండా ఉండే ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. జమ్మికుం ట మండలం తనువుల గ్రామంలోని అంకుశావాళి చెరువు కట్టను మరమ్మత్తు చేయాలని సర్పంచ్ జక్కకిరణ్ గౌడ్ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. జమ్మి కుంట మండలంలో ఉన్న ఇరిగేషన్ కు సంబంధించిన సమస్యలపై పూర్తిస్థాయిలో నివేదికలు తయారుచేసి ఉన్నత అధికారులకు అందజేస్తామని ఏ ఈ అఖిల పేర్కొన్నారు. అదేవిధంగా తనుగుల ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులు లేక తరగతి గదులు వృధాగా ఉంటు న్నాయని బడిబాట కార్యక్రమం చేపట్టినప్పటికీ విద్యా ర్థుల సంఖ్య పెరగపోవడానికి కారణం ఏమిటని సర్పం చ్ కిరణ్ గౌడ్ మండల విద్యాధికారి హేమలతను ప్రశ్నించారు. ఉద్యానవనశాఖ అధికారుల వైఫల్యం మండలంలో కొట్టొచ్చినట్టు కనబడుతుం



దని సర్పంచులు పార్లపల్లి విజయ్ కందికట్ల మధుసూదన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగులో అధికా రులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిం చారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠ శాలల అభివృద్ధి కోసం చేస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఉండాలని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న కోరారు.

**రైతు సమస్యలను పరిష్కరించాలి.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

సర్వసభ్య సమావేశం అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల సమస్యల పైన సర్పంచులు మాట్లాడడం జరిగిందని వాటి సమస్య పరిష్కారం కోసం అధికారులు తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల సమస్యలు పరిష్కారంలో అధికారులు అలసత్వం ప్రదర్శించకూడదని సకాలంలో రైతులకు ఎరువులు అందించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గడ్డం సుధాకర్ ఎంపీడీవో పద్మావతి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

### మార్కెట్ యార్డుల ఆధునికీకరణ, ఆయిల్ పామ్ సాగు విస్తరణతో రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం. మంత్రి పొన్నం ప్రభాకర్


**కరీంనగర్, (సింగిడి):** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని వ్యవసాయం, గ్రామీణ మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారత, పశుసంవర్ధక రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేసి, వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరపల్లిలో రూ. 1.56 కోట్లతో వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిపాలన భవనం, ఓపెన్ షెడ్, ఆర్చి, బోర్‌వెల్, విద్యుద్దీపాల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అలాగే వెంకటేశ్వరపల్లి మార్కెట్ యార్డులో రూ. 30 లక్షలతో 100 మెట్రిక్ టన్నుల గోదాం, నూతన మార్కెట్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లిలో రూ. 30 లక్షలతో పశువైద్య ఉపకేంద్రం, రూ. 16 లక్షలతో మహిళా సంఘ భవన నిర్మాణానికి, మండల కేంద్రంలో రూ. 20 లక్షలతో ప్రాథమిక పశువైద్య కేంద్రానికి అదనపు గదులు, మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సైదాపూర్ మార్కెట్ యార్డు అభివృద్ధి ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉందని, రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ఆధునికీకరణ చేపడుతున్నామని తెలిపారు. ఐదు ఎకరాల స్థలం అందుబాటులో ఉంటే ఏ గ్రామంలోనైనా ఉప మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రైతులు ఆరుతడి పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించిన మంత్రి, వర్షపు నీటి సంరక్షణ కోసం ప్రతి ఇంటిలో ఇంకుడు



గుంతలు, వ్యవసాయ భూముల్లో ఇంజెక్షన్ బోర్లు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. జలనిధి కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కనాటాలని కోరారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ప్రతి గ్రామంలో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రహదారులు, వంతెనలు, సాగునీటి ప్రాజెక్టులు సహా మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, అధికారులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..

హుజురాబాద్ మునిసిపల్ చైర్‌పర్సన్ రౌంటాల సుహాసిని



**జమ్మికుంట, (సింగిడి):** చేనేత వృత్తి మన భారతీయ సంస్కృతికి, విశిష్ట సాంప్రదాయానికి ప్రతీక అని, చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి ఆర్థిక అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రౌంటాల సుహాసిని పేర్కొన్నారు. శుక్రవారం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా చేనేత సెల్ అధ్యక్షులు బండారి సదానందం అధ్యక్షతన 'అంతర్జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సి పల్ చైర్ పర్సన్ రౌంటాల సుహాసిని చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సమాజానికి చేనేత కార్మికులు అందిస్తున్న సేవలను కొనియాడుతూ వారిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ... నేతన్నల శ్రమను, వారి నైపుణ్యాన్ని గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైనా ఉందన్నారు. ప్రభుత్వ పరంగా, పార్టీ పరంగా చేనేత వర్గాలకు ఎల్లప్పుడూ తగిన గుర్తింపు, తోడ్పాటు ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పట్టణ, గ్రామ శాఖల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యూ ఐ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకురాళ్ళు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర సామాజిక మాధ్యమాల చైర్మన్‌గా పెట్టేం నవీన్ నియామకం

### పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తానని నవీన్ వెల్లడి



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్‌కు చెందిన పెట్టేం నవీన్‌ను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రాష్ట్ర సామాజిక మాధ్యమాల సమన్వయకర్తగా పనిచేసిన పెట్టేం నవీన్, పార్టీ కార్యకలాపాల విస్తరణకు, కార్యకర్తల సమన్వయానికి సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఈ సందర్భంగా పెట్టేం నవీన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన




**జమ్మికుంట, (సింగిడి):** ఎండింగ్ లో ఉన్న పీఆర్సీ, ఆరు డీఏల తోపాటు అనేక విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యంలో జమ్మికుంట లోని ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జి లు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి , టీపిటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి అవినాష్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించిఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని ఆగస్టు 12, 13 తేదీలలో మండల కేంద్రాలలో , ఆగస్టు 19 వ తారీఖున జిల్లా కేంద్రంలో , ఆగస్టు 29 న ఇందిరా పార్కులో ధర్నా చేస్తామని తెలిపారు. అప్పటికి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రయత్నించకపోతే అసెంబ్లీని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మండలంలోని అందరూ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నార

# శభాష్.... మున్సిపల్ చైర్మన్

### సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి

### రాత్రి సమయంలో రోడ్లపై గుంతల పూడ్చి వేత.. అభినందిస్తున్న పట్టణ ప్రజలు

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ పట్టణ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం తన కార్యక్రమాలను నిర్వహిస్తూ పట్టణ అభివృద్ధిలో పగలు రాత్రి తేడా లేకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని పలు రహదారుల్లో గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో ఈ విషయాన్ని పట్టణ ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడం తో సమయం కూడా చూడకుండా రాత్రి పూట తన సిబ్బందితో కలిసి రోడ్లపై ఉన్న



గుంతలను కూల్చివేసి పట్టణ ప్రజల మన్ననలను పొందారు. ఈ సందర్భంగా చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు తమకు సేవలు అందిస్తారని నమ్మి నన్ను గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తన పరిధిలో ఉన్న అన్ని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని తెలిపారు. పట్టణ అభివృద్ధి తన లక్ష్యమని ప్రజా సంక్షేమం కోసం ఎంత దూరమైనా వెళ్తానని రాజకీయాలకు అతీతంగా తాను సేవలు అందిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే జమ్మికుంట మున్సిపాలిటీ అన్ని విభాగాల్లో మొదటి స్థానంలో నిలపడమే మా పాలకవర్గ లక్ష్యమని దానికి పట్టణ ప్రజల సహకరించి మున్సిపల్ సిబ్బందికి అండగా నిలవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వపై పోలీసుల దాడి

### 30 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం: దుబ్బపల్లిలో నిందితుడి అరెస్ట్.,సివిల్ సరఫరాల శాఖకు బియ్యం అప్పగింత, ప్రజలకు హెచ్చరిక

**కరీంనగర్,(సింగిడి):** రూరల్ మండలంలోని దుబ్బపల్లి గ్రామంలో ఉచిత ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నా రు. విశ్వసనీయ సమాచారం మేరకు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో కలిసి దుబ్బపల్లిలో తనిఖీలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శిరిగిరి సాగర్ (27) ఇంటిలో 37 సంచుల్లో నిల్వ ఉంచిన సుమారు 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించి, పంచాయతీదారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు చేరుకోగానే నిందితుడు పరారయ్యేందుకు




ప్రయత్నించగా అదుపులోకి తీసుకున్నారు .విచారణలో నిందితుడు పేద ప్రజల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాల కార్మికులు, కోళ్ల ఫారాలకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలి పారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తదుపరి చర్యల కోసం పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించనున్నారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని దలారులకు విక్రయించవద్దని సూచించారు. అక్రమంగా బియ్యాన్ని కొనుగోలు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

# పారమిత వరల్డ్ స్కూల్‌లో ఘనంగా హౌస్ ప్రారంభోత్సవం

### హౌస్ విధానంతో విద్యార్థుల్లో నాయకత్వం, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం పెంపొందుతుంది, డైరెక్టర్ ఈ. ప్రసూన

**కరీంనగర్,(సింగిడి):** స్థానిక అల్గునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్‌లో హౌస్ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఈ. ప్రసూన దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు హౌస్‌ల వారీగా పతాకావిష్కరణ, క్రీడా ప్రమాణ స్వీకారం, ఆకట్టుకునే మార్చ్‌పాస్ట్‌తో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులను గగన్, పృథ్వి, అగ్ని, సూర్య హౌస్‌లుగా విభజించి వాటిని డైరెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయా హౌస్‌ల విద్యార్థులు దేశభక్తి, ప్రకృతి పరిరక్షణ, శక్తి, విజ్ఞానాభివృద్ధి వంటి అంశాలపై సందేశాత్మక నృత్య ప్రదర్శనలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. డైరెక్టర్ ఈ. ప్రసూన మాట్లాడుతూ, హౌస్



విధానం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే సామర్థ్యం, సేవాభావం, క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని తెలిపారు. గత మూడు దశాబ్దాలుగా పారమిత విద్యాసంస్థల్లో ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, ప్రతి విద్యార్థి విద్యా, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తన హౌస్‌కు గౌరవం తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీకర్ మాట్లాడుతూ, హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌తో పాటు ప్రతి హౌస్‌కు కెప్టెన్, ఉప కెప్టెన్, అసెంబ్లీ, సహపాఠ్య కార్యక్రమాలు, క్రీడల కెప్టెన్‌లను ఎన్నికల ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. వారి నాయకత్వంలో విద్యార్థులు ఏడాది పొడవునా వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వి. యు. యం. ప్రసాద్, వినోద్ రావు, సమన్వయకర్త దీప్తి రాణి, హౌస్ కన్వీనర్ కె. శ్రీనివాస్, శారీరక విద్య ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమలాపూర్‌లో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

### సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం : నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు

**జమ్మికుంట, (సింగిడి):** కమలాపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహ కార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు శుక్రవారం నాప్కాబ్ చైర్మన్ కొండూరు రవీంద్రరావు స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే సహకార సంఘాల



ద్వారా ఎంతో మంది రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ వారికి చేయూత నిస్తున్నామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్ లు ఏర్పాటు చేయడం వల్ల సహకార సంఘాలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని అలాగే విద్యుత్తు ఖర్చు తగ్గించడం ద్వారా సంఘాలకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అంతేకాకుండా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల విద్యుత్ వ్యయం తగ్గుతుందని తద్వారా పర్యావరణ పరిరక్షణ ఉంటుందని సహకార సంఘాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం కమలాపూర్ పాలకవర్గం సీఈవో డైరెక్టర్లు రైతులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

### చేనేత కార్మికుల కళానైపుణ్యానికి దేశవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వ కృషి అభినందనీయం.

### సాయిని మల్లేశం,మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్, (సింగిడి):** భారతీయ జనతా పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ 39వ డివిజన్‌లోని చేనేత సహకార సంఘం కార్యాల యం వద్ద జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్య క్షుడు సాయిని మల్లేశం, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చేనేత మగ్గంపై నేయడం ద్వారా దాని పనితీరును పరిశీలించి, చేనేత కార్మికుల కళానైపుణ్యాన్ని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేనేత ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేశారని తెలిపారు. ఆ క్రమంలోనే 2015 నుంచి ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో విదేశీ వస్త్ర బహిష్కరణ, స్వదేశీ ఉద్యమ విజయానికి చేనేత కార్మికుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లు, సభ్యులను సన్మానించి, చేనేత కార్మికుల సంక్షేమానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల



చంద్రశేఖర్, తెల్ల రమేష్, చొప్పరి జయశ్రీ, మాసం గణేష్, సరస్వతి సత్యం, గుంజెటి మెతుకు సత్యం, శివన్న, అడిచర్ల రాజు, సతీష్, మునిందర్‌తో పాటు చేనేత సంఘం సభ్యులు, డైరెక్టర్లు బోగా భద్రయ్య, చంద్రయ్య, గుర్రం ఆంజనేయులు, శ్రీపతి వెంకటేశం, తుమ్మ రామస్వామి, ఆరకాల కనకయ్య, మహిళలు, స్థానికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా 'వర్షాకాల వినోదోత్సవం'

### వినోదాత్మక విద్యతో విద్యార్థుల్లో ఉత్సాహం, సృజనాత్మకత పెంపొందుతుంది

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి




**కరీంనగర్, (సింగిడి):** స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ట్ పాఠశాల (ఎస్-6 ప్రాంగణం)లో "వర్షాకాల వినోదోత్సవం"ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినోదాత్మక పద్ధతిలో బోధన అందిస్తే విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుని ఎక్కువకాలం గుర్తుంచుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తారని అన్నారు. విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తి, ఆనందం, సృజనాత్మకత, స్నేహభావం పెంపొందించడం విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి ఒడిలో వర్షపు చినుకుల మధ్య పాటలు, నృత్యాలు, ఆటలు, సృజనాత్మక కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. విద్యతో పాటు వినోదానికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా అలంకరించగా, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలకు విమలక్క సేవలు స్ఫూర్తిదాయకం

### కరీంనగర్‌లో జన్మదిన వేడుకలు.. అనాథ వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ



**కరీంనగర్, (సింగిడి):** అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు, తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ (టఫ్) చైర్‌పర్సన్, తెలంగాణ ఉద్యమ గాయని విమలక్క జన్మదిన వేడుకలను తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ నగరంలోని వీబీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న అనాథ వృద్ధుల ఆశ్రమంలో టఫ్ జిల్లా మాజీ అధ్యక్షుడు బొల్లం లింగమూర్తి, మాజీ కార్యదర్శి బిజిగిరి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో విమలక్క తన ఆట, పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపి ఉద్యమాన్ని విస్తృత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమె నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తూ, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేస్తూ పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం విమలక్క ప్రజల్లోనే ఉంటూ పోరాటాలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె ప్రజాసేవ మరింత కాలం కొనసాగాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పల్లె నారాయణ గౌడ్, సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలర్ సత్తన్న, ఉద్యమకాల ఫోరం కరీంనగర్ అధ్యక్షుడు గొడిశాల రమేష్ గౌడ్, కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు లింగంపల్లి సత్యనారాయణ, రజక సంఘం అధ్యక్షుడు పూసాల సంపత్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగ కృషివల్లే ఆరోగ్యశ్రీ పథకం

### ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి తునికి వసంత్

### ఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవ వేడుకలు



**జమ్మికుంట, (సింగిడి):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కృషి ఫలితంగా ఏర్పడిన ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని జమ్మికుంట అంబేద్కర్ చౌరస్తా దగ్గర ఎమ్మార్పీఎస్ జమ్మికుంట మండల ఇన్చార్జి తునికి వసంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వసంత్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా సమాజంలోని అన్ని వర్గాల సమస్యల పట్ల పోరాటం చేస్తూ అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉన్నారని అన్నారు .దీనిలో భాగంగా నిరుపేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచితంగా వైద్య సేవలు అందించే ఆరోగ్యశ్రీ పథకాన్ని 2004లో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం పైన పోరాటం చేసి సాధించారని గుర్తు చేశారు. మందకృష్ణ మాదిగ కృషి ఫలితంగా ఏర్పడిన విజయాలు ఈనాడు ప్రతి ఇంటిలో కనిపిస్తాయని వసంత్ వివరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మారేపల్లి శ్రీనివాస్ హుజురాబాద్ మండల ఇంచార్జ్ ఎర్ర ఆదిత్య, కనగర్తి సర్పంచ్ రామంచ సంపత్ , ముంజల రాజేష్ గౌడ్, దొడ్డ అనిల్, రామంచ రాజు, రాచపల్లి సమ్మయ్య జీడి మోహన్, రాచపల్లి వంశీ, ఎర్ర జస్వంత్ సాయి, పూరెల్ల రాహుల్ , తౌడం దిలీప్ పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

**వరి సాగుకు బదులుగా పప్పు దినుసులు, నూనెగింజలు, తృణధాన్యాలు సాగు చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, (సింగిడి):** ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో ఎల్‌నినో ప్రభావంతో వం-షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ పంట మార్పిడిని ప్రోత్సహించాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు 3.44 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, ఇప్పటివరకు 2.86 లక్షల ఎకరాల్లో పంటల సాగు ప్రారంభమైందని, ఇందులో 2.21 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలు ఆశాజనకంగా లేకపోవడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పరిమితంగా ఉండటంతో మిగిలిన భూముల్లో వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పప్పు దినుసులు, నూనెగింజలు, తృణధాన్యాలతో పాటు మొక్కజొన్న సాగును ప్రోత్సహించాలని తెలిపారు. వీటికి మార్కెట్లో డిమాండ్, మంచి ధర లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఏడాది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్నను విజయవంతంగా కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలమైన వాతావరణం, విత్తనాల లభ్యత, నేల రకం తదితర




అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. గ్రామసభలు, రైతు వేదికల ద్వారా పంట మార్పిడి ఆవశ్యకతను వివరించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

# నగర అభివృద్ధికి ఆధునిక సాంకేతికత తోడు

**35వ డివిజన్‌లో అత్యాధునిక కాంక్రీట్ మిశ్రమ యంత్రంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, (సింగిడి):** నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతను పెంచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. ఇందులో భాగంగా 35వ డివిజన్‌లో అత్యాధునిక స్వయం లోడింగ్ కాంక్రీట్ మిశ్రమ యంత్రంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా నిర్మాణ ప్రాంతంలోనే కాంక్రీట్‌ను సిద్ధం చేయడంతో పాటు మిశ్రమ నిష్పత్తులను ఖచ్చితంగా నియంత్రించవచ్చని, తద్వారా పనుల్లో వేగం పెరగడంతో పాటు నిర్మాణ నాణ్యత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. రోడ్డు పనులను తక్కువ సమయంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయడమే లక్ష్యమని మేయర్ పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో వేగంతో పాటు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, కాంక్రీట్ నాణ్యత, మిశ్రమ నిష్పత్తులు, రోడ్డు మందం, నీటి తడపడం వంటి అంశాలను ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 35వ డివిజన్‌లో చేపట్టిన విధానాన్ని పరిశీలించి, అవసరాన్ని బట్టి ఇతర డివిజన్లలోని సీసీ రోడ్లు, కాలువలు, ఇతర కాంక్రీట్ నిర్మాణ పనుల్లోనూ ఆధునిక యంత్రాలను వినియోగిస్తామని తెలిపారు. కరీంనగర్‌ను ఆధునిక మౌలిక వసతులతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు



సాంకేతికతను అందిపుచ్చు కుంటామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని మేయర్ అన్నారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సాధవిని సుజాత శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసిన

## డిప్యూటీ మేయర్ సునీల్‌రావు

**హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**



**కరీంనగర్, (సింగిడి):** భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు సోమవారం తన నివాసంపై జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్ర మం ప్రజల్లో జాతీయ భావాన్ని, దేశభక్తిని మరింత పెంపొందిస్తుం దని అన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కార్యక్ర మంలో భాగస్వాములై తమ ఇళ్లపై మువ్వన్నెల జెండాను ఎగురవేసి, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ కొనసాగుతుందని సునీల్‌రావు తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మండలం లోని వెంకటేశ్వర్ల పల్లి గ్రామానికి చెందిన పూల్లూరి మధునమ్మ మృతి చెందగా ఆమె కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గం. వెంకటేశ్వర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పూల్లూరి మధునమ్మ మృతి చెందిన సందర్భంగా, వారి కుటుంబాన్ని పరామర్శించి అండగా నిలిచారు. గ్రామ సర్పంచ్ పోల్సాని వినోద నారాయణరావు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు గ్రామపంచాయతీ తరఫున అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోయిని అనిల్, బండారి ప్రశాంత్ తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం

## జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్



**మల్లాపూర్, (సింగిడి):**: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎలుక కమలాకర్‌ను నియమిస్తూ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మెట్ పల్లి పట్టణంలో ఎలుక కమలాకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మగ్గిడి వెంకట నరసయ్య మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తూనే, యువజన సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కమలాకర్ కృషి చేయాలని సూచించారు. నూతనంగా నియమి తులైన ఎలుక కమలాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మగ్గిడి వెంకట నరసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్క మోహన్, రాష్ట్ర కార్యదర్శి నేరెళ్ల శ్రీధర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంటపర్తి అశోక్, మెట్ పల్లి డివిజన్ కమిటీ నాయకులు తుక్కరామ్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు శోభన్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ అంబేద్కర్ ఆశయాల సాధనకు, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎలుక కమలాకర్ తెలిపారు.

## కరీంనగర్ జిల్లాలో 'హర్ ఘర్ తిరంగా' అభియాన్

**స్వగృహంపై జాతీయ జెండా ఎగురవేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సోమవారం 'హర్ ఘర్ తిరంగా' అభియాన్ ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం తన కుటుంబ సభ్యులతో కలిసి స్వగృహంపై జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, జాతీయ పతాకం దేశ ప్రజలందరికీ గర్వకారణమని, దేశభక్తికి స్ఫూర్తినిచ్చే ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. 2022 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, 'వికసిత భారత్' నిర్మాణానికి మద్దతు తెలుపుతూ జాతీయ ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# దుబ్బ మల్లన్న ఆలయాన్ని సందర్శించిన ఎండోమెంట్ అధికారులు

**ఆలయ అభివృద్ధి పనులకు పరిశీలన**

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామ శివారులో గల అతి పురాతనమైన శ్రీ దుబ్బ మల్లన్న దేవస్థానాన్ని ఎండోమెంట్ అధికారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి ఆలయ అధికారులకు ఘన స్వాగతం పలికారు. అతి పురాతన దైవ క్షేత్రంగా పేరు పొందిన శ్రీ దుబ్బ మల్లన్న ఆలయ ప్రాంగణం లో గల పోచమ్మ గుడి ఎల్లమ్మ గుడి ల అభివృద్ధి కొరకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆలయ అభివృద్ధి పనుల లో భాగంగా కామన్ గుడ్ నిధులనుండి అభివృద్ధి పనులు చేయుటకు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న వివిధ పనులకు ఎండోమెంట్ అధికారులు కొలతలు వేసి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈవో సుభద్ర



తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో ఆలయాలకు మహర్దశ పడుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని పలు ఆలయాల పై ప్రత్యేక చొరవ చూపెడుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో దుబ్బ మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక వసతులు కల్పించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముద్దమల్ల రవి ఒకటో వార్డు కౌన్సిలర్ పోలు దివ్య బిక్షపతి రెండవ వార్డ్ కౌన్సిలర్ పోల్సాని శిల్ప వేణు రావు మాజీ కౌన్సిలర్ రావికంటి రాజకుమార్ ఎండోమెంట్ ఏఈ సంతోష్ రెడ్డి టెక్నికల్ ఇంజనీర్ ప్రమోద్ పటేల్ అసిస్టెంట్ స్థాపతి వెంకటేశ్వర్లు ఆలయ ఈవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంటలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



**జమ్మికుంట, (సింగిడి):** దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ భారతీయ జనతా పార్టీ ఇల్లందకుంట మండల ప్రధాన కార్యదర్శి గుత్తికొండ రాంబాబు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని భారత్ మాతాకీ జై, వందే మాతరం అంటూ దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు గుత్తికొండ రాంబాబు మట్ట పవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావనను చాటాలని, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, అఖండత, సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలోగుత్తికొండ రాంబాబు ఉప్పుల రమేష్, ఇంగ్లే ప్రభాకర్,మట్ట పవన్ రెడ్డి, ఏనుగు సురేందర్ రెడ్డి, తుపాకుల సతీష్, ఉప్పు దుర్గయ్య, సోమిడి సురేందర్, చింతల ఐలయ్య, సామల కర్ణాకర్ రెడ్డి, జిల్లెల శ్రీపాల్ రెడ్డి, మద్దూరి మల్లేష్, అసాలా సుధాకర్,చదువు సాయి రెడ్డి, చిట్ల శ్రీనివాస్, మురహరి గోపాల్, రావుల అశోక్,ఎలేవెని శ్రీధర్,పిట్టల రాజు బోయిని శివకృష్ణ, చిలుక రాజు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించి గౌరవించాలి

**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పెన్షన్ ప్రకటించాలి, ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు డిమాండ్**

**కరీంనగర్, (సింగిడి)::** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వారికి సైనిక్ సమ్మాన్ తరహాలో పెన్షన్ ప్రకటించి గౌరవించాలని ప్రజా సంఘాల జేఏసీ జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉద్యమ ముఖ్య నాయకుల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1969 నుంచి 2013 వరకు 45 ఏళ్ల సుదీర్ఘ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు ప్రాణాలను సైతం లెక్కచేయ కుండా పోరాడారని గుర్తుచేశారు. లాఠీ దెబ్బలు తిని, జైలు జీవితం గడిపిన ఉద్యమకారుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని పేర్కొన్నారు. ఉద్యమకారులకు నెలకు రూ. 12 వేల పెన్షన్‌తో పాటు రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. వారి కుటుంబాలకు ఉచిత కార్పొరేట్ వైద్యం, కుటుంబంలో ఒకరికి వయోపరిమితి లేకుండా ప్రభుత్వ ఉద్యోగం, 200 గజాల ఇంటి స్థలంలో ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రియాశీలకంగా ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వ రంగ సంస్థల నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రజా సంఘాల జేఏసీ



ఆధ్వర్యంలో ఆగస్టు 15న కరీంనగర్‌లో రాష్ట్ర, జిల్లా స్థాయి ఉద్యమ కారులతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు పోలాడి రామారావు తెలిపారు. సమావేశంలో ఉద్యమకారులు కొత్తకొండ రవీందర్ రావు, శ్రీపాద సత్యనారాయణ, దేవుళ్లపల్లి రామమూర్తి, బోయినపల్లి శ్రీనివాస్ రావు, పెంచాల రంగయ్య, జన్ను జయరాజ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోతారం (ఎస్)లో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాలు

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నేతన్నల మగ్గం..**





**హుస్నాబాద్ (సింగిడి)::** హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్) గ్రామంలో పోచమ్మ బోనాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల ఆటలు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నేతన్నల చేనేత ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ....**

బోనాల కార్యక్రమంలో ట్రాక్టర్‌పై ప్రత్యేకంగా మగ్గాన్ని ఏర్పాటు చేసి, అందులోనే నేతన్నలు చీరలు నేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తమ సంప్రదాయ చేనేత వృత్తిని కళ్లకు కట్టినట్లు చూపిస్తూ నేతన్నలు మగ్గంపై చీరను నేసి, ఆ చీరను పోచమ్మ అమ్మవారికి సమర్పించారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. నేతన్నల కళను, చేనేత వృత్తి గొప్పతనాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమం బోనాల వేడుకల్లో ప్రత్యేకంగా నిలిచింది.

# ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు...

**మెట్‌పల్లిలో అరుదైన ఘటన.. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ జననం**

**మెట్ పల్లి (సింగిడి):** జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి రాజలక్ష్మి–నరేందర్ దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారు. సోమవారం ప్రసవం కోసం మెట్‌పల్లి పట్టణంలోని బేషబా మిషన్ ఆసుపత్రికి రాజలక్ష్మి చేరుకున్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు ప్రసవం నిర్వహించగా.. ఒకేసారి ముగ్గురు శిశువులకు జన్మనిచ్చారు. జన్మించిన వారిలో ఒకరు మగబిడ్డ కాగా, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగబిడ్డ 1.800 కిలోల బరువు ఉండగా.. ఇద్దరు ఆడపిల్లలు ఒక్కొక్కరు 1.500 కిలోల బరువుతో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ముగ్గురు శిశువులతోపాటు తల్లి ఆరోగ్యంగా ఉన్నారని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి.

మొదటి సంతానంలోనే ఒకేసారి ముగ్గురు పిల్లలు జన్మించడంతో రాజలక్ష్మి–నరేందర్ దంపతులు, కుటుంబ సభ్యుల్లో ఆనందం వెల్లివిరిసింది.



బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకుని తల్లీబిడ్డలను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు స్వీట్లు పంచుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించడంతో ఈ విషయం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.

"పెద్ది" కి కేడీసీసీ బ్యాంక్ వైస్ చైర్మన్

# ఘన నివాళులు

**సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటు**



**జమ్మికుంట, (సింగిడి):** నర్సంపేట మాజీ శాసనసభ్యులు తెలంగాణ పోరాట యోధుడు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆకస్మిక మృతి బిఆర్ఎస్ పార్టీకి, ఆ కుటుంబానికి తీరని లోటు అని కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ అన్నారు. సోమవారం నల్లబెల్లిలోని దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగ్రామానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన సుదర్శన్ రెడ్డి నిస్వార్థ ప్రజా సేవకుడిగా ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని తెలిపారు. ఉద్యమ కెరటం ఆకస్మికంగా మృతి చెందడం తమను కల్చివేసిందని ఎంతో భవిష్యత్తు ఉన్న నేత ఆకస్మికంగా మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. భవిష్యత్తులో టిఆర్ఎస్ పార్టీ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని పార్టీ అధినేత కెసిఆర్ ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటారని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఒక మంచి నాయకుడిని కోల్పోయామని తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు జెకె అఖిల్ గౌడ్ జోడు కుమారస్వామి శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కనీస వేతనాలు అమలు చేయాలి..

**మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన**



**మెట్ పల్లి (సింగిడి):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయడంతోపాటు, గతంలో నిర్ణయించిన వేతనాలను యథా విధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ ఉస్మాన్ మాట్లాడుతూ.. జీవో ఎంఎస్ నం. 14 ప్రకారం మున్సిపల్ కార్మికులకు వేతనాలు అమలు చేయాలని కోరారు. 2021 జూన్ 11న జారీ చేసిన జీవో ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 16,600, స్కిల్డ్ కార్మికులకు రూ. 20,500, హైస్కిల్డ్ కార్మికులకు రూ. 22,750 వేతనాలు నిర్ణయించారని తెలిపారు. అయితే తాజాగా జూలై 12న జారీ చేసిన జీవో ఆర్‌టీ నం. 1181 ద్వారా వేతనాల్లో కోత విధించారని ఆరోపించారు. కార్మికుల వేతనాలను తగ్గించడం సరికాదని, వెంటనే జీవో నం. 1181ను ఉపసంహరించుకుని గతంలో అమలైన వేతనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ శాశ్వత ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, యమ నరసయ్య, మధురమ్మ, లక్ష్మి, బర్ల నరసయ్య, వాజిద్, గంగాధర్, నిజాం తదితరులు పాల్గొన్నారు.

# ఈ20 విధానం రద్దు చేయాలి..

**కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా మెట్‌పల్లిలో కాంగ్రెస్ భారీ ధర్నా**



**మెట్ పల్లి, (సింగిడి):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మెట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రైసోద్దీన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచే ఈ--20 విధానాన్ని వెంటనే పునఃపరిశీలించి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం వల్ల వాహనాల మైలేజీ తగ్గడంతోపాటు ఇంజిన్ల పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉందని, ఫలితంగా దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు. పెట్రోల్ వినియోగ పరిమాణం తగ్గుతున్న నేపథ్యంలో ధరల భారాన్ని ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలకు సంబంధించిన విదేశీ విరాళాల నియంత్రణ చట్టంలో కేంద్రం తీసుకొస్తున్న మార్పులపై కూడా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పేదలు, బలహీనవర్గాలకు సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ఇబ్బందులు కలిగించేలా నిబంధనలు ఉండకూడదన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే సంస్థల కార్యకలాపాలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజలపై ప్రభావం చూపే విధానాలను పునఃపరిశీలించి సామాన్యుల ప్రయోజనాలను కాపాడాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
మంగళవారం 11-8-2026

## ఘనంగా పి.వి జయంతి వేడుకలు



**భీమదేవరపల్లి, (సింగిడి):** భారతదేశ మాజీ ప్రధానమంత్రి, పీవీ నరసింహారావు 'భారతరత్న' పి.వి. నరసింహారావు 105వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర లో ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి, దేశానికి ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన నివాళులర్పించారు. కార్యక్రమానికి ఖాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పీవీ కుటుంబ సభ్యులు పీవీ మదన్ మోహన్ హాజరై నివాళులర్పించారు. అలాగే సీఐ పులి రమేష్, ఎస్ఐ దివ్యతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. రాజకీయ, ప్రజాప్రతినిధులలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పి. రాజిరెడ్డి, ఎల్కతుర్తి మార్కెట్ వైస్ చైర్మన్ బొక్కల శ్రావంతి, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య, జిల్లా కార్యదర్శి ఆదరి రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిదురాల స్వరూప, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్‌తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, "తెలుగు జాతి గర్వకారణం, భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అయిన భారతరత్న పి.వి. నరసింహారావు ఆశయాలు చిరస్మరణీయం. ఆయన చూపిన బాటలో నడవడం మనందరి బాధ్యత" అని కొనియాడారు. దేశ రాజకీయ, ఆర్థిక రంగాల్లో పి.వి. నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకమని నాయకులు పేర్కొన్నారు.

## -పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

-అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వినోద్ కుమార్ కోరారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సందర్శించి 0 నుండి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలించాలంటే ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ఎంతో ముఖ్యమని అన్నారు. పోలియో చుక్కలు సురక్షితమైనవని, పిల్లలభవిష్యత్తును ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఇవి కీలక పాత్ర పోషిస్తాయనితెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలువేయించకుండా మిగిలిపోకుండా ఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలుచేపట్టాలని సూచించారు. బూత్‌లకు రాలేని చిన్నారులను గుర్తించి ఇంటింటికీవెళ్లి పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. తల్లిదండ్రులు సమీప పోలియోకేంద్రానికి తమ చిన్నారులను తీసుకువచ్చి చుక్కలు వేయించాలని కోరారు. పోలియో రహిత వనపర్తి జిల్లా లక్ష్య సాధనకు ప్రజలందరూ ఆరోగ్య శాఖకుసహకరించాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర వైద్యాధికారులు, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారంలో పల్స్ పోలియో ప్రారంబించిన ఇంచార్జీ సర్పంచ్



**భీమదేవరపల్లి ,(సింగిడి):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 0--5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. "రెండు చుక్కలు -- పోలియోకు పూర్తి రక్షణ" అనే నినాదంతో ప్రతి చిన్నారిని సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఏఎన్ఎం వనజ, అంగన్వాడీ టీచర్ కవిత, ఆశా కార్యకర్త రేణికుంట్ల భాగ్య తదితరులు పాల్గొన్నారు.

## -మాజీ మున్సిపల్ చైర్మన్ సతీమణి మృతిపట్ల మాజీ మంత్రి సంతాపం



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** వనపర్తి మాజీ మున్సిపల్ చైర్మన్‌డాక్టర్ అశ్విని దామోదర్ సతీమణి అశ్విని జయమ్మ మృతి పట్ల ఆదివారం మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వారి కుమారుడు డాక్టర్ అశ్విని అమరేశ్వర్ ను ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యంగాఉండాలని కోరారు. కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని కల్పించాలని ఆయన ఆకాంక్షించారు.

## పల్స్ పోలియో ప్రారంభించిన సర్పంచ్ బోయిన వేణు.



**పాలేరు (సింగిడి):** పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమనికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ బోయిన వేణు హాజరై ప్రారంభిం చారు... 5 సంవత్స రాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కార్యక్రమంలో వార్డు నెంబర్లు కాలింగి వీరబాబు లక్క నాగరాజు మేకలబ్రహ్మం తీగ హనుమంతు దేగల సౌజన్య వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టారు.

## పల్స్ పోలియో లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి పల్స్ పోలియో కార్యక్రమం ఎంతో కీలకమని పేర్కొన్నారు. తల్లిదండ్రులెవరూ తమ చిన్నారులను ఈ కార్యక్రమానికి దూరం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, లేదా పోలియో బూత్‌లకు తీసుకవచ్చి తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్లు గేరుగంటి లక్ష్మి నారాయణ, కో ఆప్షన్ మెంబర్ ముబాషీర్ అలీ, ఏఙ వేణు ప్రసాద్, ఎమ్మార్వో బింద్, డి.ఎం.హెచ్.ఓ వెంకట్, వలపటి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి: కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (సింగిడి):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కామారెడ్డిలోని 14వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ రాంశెట్టి హర్షిత, 5 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని ఆదివారం కోరారు. ఎన్జీవోస్ కాలనీ పరిధిలోని అభ్యాస స్కూల్, 16 ఫోర్షన్ స్ట్రీట్ లో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, రెండు చుక్కలు భవిష్యత్తులో అంగవైకల్యాన్ని నివారిస్తాయని ఆమె పిలుపునిచ్చారు.

## లక్ష్మి నరసింహ స్వామి కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక....

### నూతన అధ్యక్షులు గా జె. సుధాకర్...ప్రధాన కార్యదర్శిగా అఖిల్

**మల్కాజిగిరి, (సింగిడి):** కాలనీ అభివృద్ధితో పాటు, మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని నూతన అధ్యక్షులు జె సుధాకర్ అన్నారు. ఆదివారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీ అసోసియేషన్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా జె సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా, ట్రెజరర్ గా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బండ కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ చారి, సహాయ కార్యదర్శులుగా మునీర్, మల్లేష్, రవి నాయక్, అడ్వైజర్లుగా బరత్ సాగర్, రాజయ్య, కనకయ్య, పరమేష్, కమిటీ సభ్యులుగా సురేష్ సాగర్, కూర అరుణ్, మాదేశ్, సమల కృష్ణ, రాజేష్, ప్రసాద్, శ్రవణ్, దామోదర్, శ్రీధర్,రాంచందర్, సంతోష్, శ్రీనివాసులు, హరి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమం లో కాలనీ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే ద్యాప గోపాల్ రెడ్డి సేవలు మరువలేనివి

### శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకురి(సింగిడి):** కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ ఆవరణలో నిర్వహించిన మాజీ శాసన సభ్యులు,మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు,మాజీ డీసీసీ చైర్మన్ స్వర్గీయ గుడిగానిపల్లి ధ్యాప గోపాల్ రెడ్డి శత జయంతి ఉత్సవాలకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్రనాయకులు టాక్సిసి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వర్గీయ గోపాల్ రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం ఆయన ప్రజా సేవలు,రాజకీయ ప్రస్థానం, కల్వకుర్తి ప్రాంత అభివృద్ధికి చేసిన విశేష కృషిని స్మరించు కుంటూ, ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపో యిన గొప్ప నాయకుడిగా కొనియాడారు, వారి ఆశయాలు,విలువలు భావితరాలకు స్ఫూర్తిగా



నిలవాలని ఆకాంక్షించారు,అలాగే శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వందేమాతరం ఫౌండేషన్ మరియు గోపాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైక్లింగ్ పోటీలకు కూడా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి హాజరై,యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు, పోటీల్లో పాల్గొన్న యువతను అభినందిస్తూ, పాల్గొన్న వారం దరికీ అందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాంద్ర సాయిరెడ్డి , స్వర్గీయ ద్యాప గోపాల్ రెడ్డి ట్రస్ట్ సభ్యులు గోలి ప్రభాకర్ రెడ్డి,వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అంధ్యక్షులు నర్సిరెడ్డి, శృతిలయ కల్చరర్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, సీనియర్ నాయకులు శేఖర్ రెడ్డి,కార్యక్రమ నిర్వాహక సభ్యులు సందీప్ తో పాటు ప్రశాంత్ రెడ్డి అభిమానులు, కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం

**భిక్కనూర్, (సింగిడి):** మండల వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో నివారణ కోసం పోలియో చుక్కలు వేయించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు ప్రత్యేక బూత్‌లలో ఆరోగ్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. కార్యక్రమాన్ని వైద్యాధికారులు పర్యవేక్షిస్తూ, ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ప్రతి అర్హత కలిగిన చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు, లింబాద్రి, దయాకర్ రెడ్డి, సిద్ధారెడ్డి, గజ్జె వేణు, మమత వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## పల్స్ పోలియోను విజయవంతం చేయాలి : చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు, (సింగిడి):** చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆయన ప్రారంభించి, చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. గతంలో పోలియో



మహమ్మారి కారణంగా అనేక మంది చిన్నారులు అంగవైకల్యానికి గురయ్యారని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించుకోకుండా మిగలకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. మొదటి రోజు కేంద్రాలకు రాలేని చిన్నారుల కోసం సోమవారం, మంగళవారం ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు పర్వీన్ షకీల్, సౌజన్య దిలీప్ రెడ్డి, హరి శంకర్ నాయుడు, మన్యం, వైద్యాధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా పల్స్ పోలియో

**భీమదేవరపల్లి, (సింగిడి):** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని పీహెచ్‌సీ వంగర మరియు ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్ పోలియో బూత్ డే విజయవంతంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ఆరోగ్య శాఖ కీలక అడుగు వేసింది. పీహెచ్‌సీ వంగర పరిధిలో 23 పల్స్ పోలియో బూత్‌లు, ఒక మొబైల్ టీమ్ ద్వారా మొత్తం 2,315 మంది లక్ష్య చిన్నారుల్లో 2,180 మందికి పోలియో చుక్కలు వేశారు. అలాగే ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1,885 మంది లక్ష్య చిన్నారుల్లో 1,875 మందికి పోలియో డ్రాప్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డా. రహ్మాన్, డా. దినేష్, పీహెచ్‌ఎన్ వాణి, హెచ్‌ఈఓ మోహన్, గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రహ్మాన్ మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. బూత్‌లకు రాలేకపోయిన చిన్నారుల కోసం వచ్చే రెండు రోజుల



పాటు ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేస్తామని, ఏ ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు ఆరోగ్య శాఖకు సహకరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆరోగ్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని అధికారులు పునరుద్ఘాటించారు.



## పోలియో చుక్కలు విజయవంతం

**వెల్దుర్తి మాసాయిపేట, (సింగిడి):** మాసాయిపేట మండలం కేంద్రంలోని మాసాయిపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి తో కలిసి పోలియో చుక్క పంపిణీ కార్యక్రమం చేశారు మండల కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు అదేవిధంగా స్టేషన్ మాసాయిపేట గ్రామ సర్పంచ్ స్టేషన్ శ్రీను ఆధ్వర్యంలో పోలియో చుక్కలు చిన్న పిల్లలకు కార్యక్రమం చేశారు అనంతరం కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తో మాజీ ఎంపిటిసి, పాలకవర్గం గ్రామ ప్రజలు పాల్గొన్నారు అనంతరం చిన్న పిల్లలు ఆరోగ్యం బాగుండాలంటే పోలియో చుక్కలు వేయించాలని సూచనలు తెలిపారు .



## పోలియో రహిత సమాజం కోసం కృషి చేద్దాం

మునిసిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్



**అమరచింత, (సింగిడి):** పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అమరచింత మున్సిపల్ చైర్పర్సన్ జింక సువర్ణ రవి యాదవ్ పిలుపునిచ్చారు. వలస పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం అమరచింత తహసిల్దార్ కార్యాలయం వద్దఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు మున్సిపల్ చైర్ పర్సన్ పోలియో చుక్కలు వేశారు. అనంతరం చైర్పర్సన్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో మహమ్మారిని తరిమికొట్టేందుకు కృషి చేద్దామని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జింక రవి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంత్ రెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.

### తాగునీటి గోస తీర్చిన పిఎసిఎస్ చైర్మన్

**అమరచింత, (సింగిడి):** తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారురేచింతల సింగిల్విండో చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి. వీరరాఘవపురంలోతాగునీటి గోస తీరుస్తానని ఇచ్చిన హామీ ప్రకారం ఆదివారం గ్రామంలోనిసుంకులమ్మ దేవాలయం వద్ద లక్ష రూపాయల వ్యయంతో తాగునీటి బోరును వేయించారు. బోరులో నీళ్లు సమృద్ధిగా పడ్డాయి. తమ గ్రామానికి తాగునీటికి దోశ తీర్చినపిఎస్సి చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డికి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామ సర్పంచ్, వార్డుసభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పిల్లలకు పోలియో చుక్కలు వేద్దాం.. వారి ఆరోగ్యాన్ని కాపాడుదాం

-మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, (సింగిడి):** పిల్లలకు పోలియో చుక్కలు వేయించివారి ఆరోగ్యాన్ని కాపాడుదామని సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఆదివారం పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. పోలియో చుక్కలు వేయడం వల్ల వారి ఆరోగ్యాన్నిరక్షించడంతోపాటు పోలియో రహిత గ్రామంగా తీర్చిదిద్దిన వారం అవుతామనిచెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటు గ్రామస్తులు రాములు, రామిరెడ్డి, ప్రతాపరెడ్డి, బాలరాజు, కొములయ్య, శ్రీకాంత్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, శేషయ్య యాదవ్, బుచ్చయ్య, రాఘవేంద్ర, శివకుమార్, ఉషయ్య తదితరులుపాల్గొన్నారు



## పెబ్బేరులో ఆర్ఎస్ఎస్ హిందూ సామ్రాజ్య దినోత్సవం

యువ సాంఘిక్ కార్యక్రమం



**పెబ్బేరు, (సింగిడి):** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవం, యువ సాంఘిక్ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వయంసేవకులు, యువకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో సంఘ సంప్రదాయ పద్ధతిలో స్వయంసేవకులు శారీరక విన్యాసాలు, దండ ప్రదర్శనలు, వ్యాయామ విన్యాసాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. యువతలో క్రమశిక్షణ, సేవా భావం, దేశభక్తిని పెంపొందించే విధంగా కార్యక్రమం సాగింది. అనంతరం నిర్వహించిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య దినోత్సవం చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశ అభ్యున్నతి కోసం యువత సేవా దృక్పథంతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యత, జాతీయ చైతన్యం, సామాజిక బాధ్యత పెంపొందించడంలో యువత ముందుండాలని వక్తలు సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా, మండల స్థాయి బాధ్యులు, స్వయంసేవకులు, యువకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం శాంతియుత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**కోడేరు(సింగిడి):** పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా పాఠశాల నిర్మాణం పనులను రాష్ట్ర సాంస్కృతిక ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నాడు పరిశీలించారు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని వర్గాల పిల్లలకు సమానంగా నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్సను ఏర్పాటు చేస్తుందన్నారు పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు నిర్మాణం పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్మాణం పనులు చేపట్టాలన్నారు విద్యతో పాటు విద్యార్థులకు సమగ్ర అభివృద్ధికి ఆధునిక వసతులైన ప్రయోగశాలలు క్రీడా సదుపాయాలతో నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు ప్రతి నియోజకవర్గంలో బాలురు బాలికలకు ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వాల లక్ష్యమన్నారు నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు జెడ్పోలు లో నిర్మిస్తున్న పాఠశాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రపంచ స్థాయిలో పోటీపడే విధంగా తయారు చేయాలని ఆయన అన్నారు.

# పేదల గొంతుకగా అన్నాభావు సాటే

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి)::** పేదల గొంతుకగా అన్న బాబు సాటే నిలిచా రని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారా యణ గుప్త తెలిపారు. నగరంలోని చంద్రశేఖర్ నగర్ కాలనీ చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతంగ్ సమాజంలో పుట్టిన అన్నాభావు చిన్నప్పటి నుంచి కుల వివక్షను ఎదుర్కొన్నారన్నారు. మిల్లులో పనిచేస్తూ వీధి దీపాల కింద కూర్చొని చదివి గొప్ప రచయిత కవిగా ఎదిగారని గుర్తు చేశారు సుమారు 35 పుస్తకాలను రాసి ఆదర్శంగా నిలిచారన్నారు. కేవలం రచనలు చేయడమే కాకుండా మహారాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు జై భీమ్ జై భారత్ అనే నినాదంతో అంబేద్కర్ ఆలోచనల ను ప్రజల్లోకి తీసుకెళ్లారన్నారు. ప్రధానంగా చదువు ఒక్కటే ఆయుధమని కులం పేరుతో ఎవరిని చిన్నచూపు చూడొద్దు. కష్టపడితే ఏదై నా సాధించవచ్చు అని సందేశాన్ని ఇచ్చార న్నారు. నిజామాబాద్ అర్బన్ లో ఉన్న అన్నా భావు సాట సమాజానికి తన వంతు సహకా రం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, బంటు ప్రీతి ప్రవీణ్, అన్నాభావు సాథే సమాజ్ కమిటీ అధ్యక్షుడు గంగాధర్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ తీరు మారకుంటే పతనమే

కార్పొరేట్, సంపన్నుల సేవలో కేంద్ర సర్కార్

## అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు

ఖమ్మంలో విజయవంతమైన జైల్ భరో





**ఖమ్మం, (సింగిడి):** మోడీ తీరు మారకుంటే పతనం తప్పదని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. కార్మి క హక్కులను హరించి వేస్తూ లేబర్ కోడ్లను అమల్లోకి తీసుకు వచ్చారని వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టి రైతును భూమి నుంచి తరిమేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఇందుకు ప్రతిఫలం అనుభ వించక తప్పదని నేతలు తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా సెంట్రల్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఖమ్మంలో సోమవారం జైల్బరో కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. వంద లాది మంది రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభు త్వ విధానాలను నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. పోలీసులు అఖిలపక్ష నేతలను -అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ వందల సంఖ్యలో ఆందోళనకారులు తమను కూడా అరెస్టు చేయాలంటూ పోలీస్ స్టేషన్లో చొచ్చుకుని వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ ఆందోళనకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు, మాజీ శాసన సభ్యులు గుమ్మడి నర్సయ్య, బానోత్ చంద్రావతి, సివై పుల్లయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వి. కోటేశ్వరరావు, -వై. ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు శింగు నర్సింహారావు, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జి. రామయ్య, యర్రా శ్రీనివాస్, మెరుగు -సత్య నారాయణ, అశోక్, నరాల నరేష్ నాయుడు, ఎండివై పాషా తదితరులు నేతృత్వం వహించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు మాట్లాడుతూ మోడీ సర్కార్ సంపన్నుల సేవలోనే ఉందని రైతులు, కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. దేశ సంపదను అంబానీ, -అదానీలతో పాటు కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయ రంగాన్ని కూడా వారి పరం చేసేందుకే నూతన సాగు చట్టాలను తీసుకు వచ్చిందని ఆయన తెలిపారు. చారిత్రిక పోరాట నేపథ్యంలో సాగు చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన దొడ్డి దారిని వాటిని అమలు చేస్తుందని ఆయన ఆరోపించారు. పంటకు మద్దతు ధరను ప్రకటించడంతో పాటు వాటి అమలుకు మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు రావాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయని మద్దతు ధర గ్యారెంటీ చట్టాన్ని తీసుకు వచ్చేంత -వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనను నిర్వహించి ఈ ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తామన్నారు.

12 ఏళ్లకాలంలో మోడీ ఏ ప్రజాఅనుకూల నిర్ణయాన్ని చేయలేదని ప్రజ లను వంచించే ప్రయత్నంలోనే దశాబ్ద కాలం గడిపారని హేమంతరావు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో సర్కార్ ఘోరంగా విఫలమైందని ఆయన తెలిపారు. సంఘటిత పోరాటాలే మోడీ ప్రభుత్వాన్ని నిలువరిస్తా యన్నారు. రాముడి పేరుతో ఎంతో కాలం ప్రజలను వంచించలేరని హేమంతరావు తెలి పారు. కార్యక్రమంలో మిడికంటి వెంకట రెడ్డి, శంకరయ్య, సాంబశివరెడ్డి, వరదా నర్సింహారావు, బండి పద్మ, వై. విక్రం, నవీన్రెడ్డి, శోభ, శిరోమణి తదితరులు పాల్గొన్నారు.

# చిత్రపటానికి డోకూరి ప్రభాకర్‌రెడ్డి నివాళులు



**కల్వకుర్తి, (సింగిడి):** తలకొం డపల్లి మండలంలోని చంద్రధన గ్రామా నికి చెందిన మాజీ ఎంపీటీసీ బండల సుధాకర్ రెడ్డి మాతృ మూర్తి మరణించడం జరిగింది. ప్రైవేట్ పశీక్షన్ హాల్లో నిర్వహించిన దశదిన కర్మ కార్యక్ర మంలో, తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి పాల్గొని వారి చిత్ర పటానికి పులా మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి కసిరెడ్డి విజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, కాకి కృష్ణ, ఆల్వాల్ రెడ్డి, శంకర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ఉద్యమం

50 గంటల పాటు ఆట.. పాట.. మాటల ప్రస్థానం

సెప్టెంబర్ 26న ఉదయం పది గంటల నుంచి ప్రజా కళా జాతర ప్రారంభం

విలేకరుల సమావేశంలో విమలక్క




**ఖమ్మం ప్రతినిధి, (సింగిడి):** అరుణోదయ విమలక్క 50 ఏళ్ల ప్రజా సంస్కృతిక ప్రస్థానాన్ని పురస్కరించుకొని సెప్టెంబర్ 26న ఉదయం పదిగంటల నుంచి సెప్టెంబర్ 28 మధ్యాహ్నం 12: గంటల వరకు ఏకధాటిగా 50గంటల పాటు ఆట.. పాట.. మాటలతో ప్రజా కళా జాతర కార్యక్రమం హైదరాబాదులో నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విప్లవోద్యమాల నుండే విప్లవకారులు పుడతారు. ప్రజా ఉద్యమాల నుండి ప్రజా కళాకారులు ఉద్భవిస్తారు.

తన జీవిత కాలం విప్లవ ప్రజా సంస్కృతిక ఉద్యమాలలో 50 ఏళ్ల మైలురాయిని అధిగమించిన తన ప్రస్థానంలో 50 గంటల పాటు ఏకధాటిగా ఆట,పాట, మాటలతో ప్రజాకళ జాతరను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. బహుళ ప్రజా కళలు, జానపద కళారూపాలు , ప్రజా కళా జాతర, మనువాదంగా సంస్కృతి మూడ త్వమై, సామ్రాజ్యవాద సంస్కృతి సాగుతున్న దాడికి ప్రత్యామ్నాయ ప్రజా సంస్కృతి నిర్మాణంలో భాగమై సంస్థలను, శక్తులను, వ్యక్తులందరినీ సాదరంగా ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. విమలక్క ఒక వ్యక్తి కాదు అని, సామూహిక శక్తి అని 1974 ఆగస్టులో అరుణోదయ సంస్కృతిక సమైక్య ఉస్మానియా లో పురుడు పోసుకునేటప్పటికి బాల గాయనిగా వెలుగులోకి వచ్చిన విషయం ప్రతి ఒక్కరికి తెలుసునని అన్నారు. అనేక కష్ట నష్టాలను ఎదుర్కొని జైలు జీవితాన్ని అనుభవించి ప్రజా ఉద్యమాలే ఆయుధంగా ఎంచుకొని అరుణోదయ సంస్కృతిక విప్లవంలో పాటల ప్రస్థానం ఒక మరుపురాని ఘట్టం అన్నారు. తన జీవితం ప్రజలకు అంకితంగా భావిస్తూ తన స్వభావం కలిగిన కార్యకర్తలను కళాకా రులను ప్రేమ పూర్వకంగా 50 గంటల పాటు సాగే ప్రజా కల జాతర నిర్వహణలో స్వచ్ఛం దంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విమలక్క పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో అరుణోదయ సంస్కృతిక సమైక్య రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, ప్రధాన కార్యదర్శి పోతుల రమేష్, ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, వర్ష సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, టిపి జెఎసి జిల్లా కన్వీనర్ విజయ్, అరుణోదయ సంస్కృతిక సమైక్య సహకార దర్శి రాకేష్, ఉపాధ్యక్షులు అనిత తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడిదారుల విధానాలకు వ్యతిరేకంగా

# తిరుగుబాటు పోరాటాలు చేద్దాం

## కార్మిక, రైతు సంఘాలు





**గద్వాల ప్రతినిధి (సింగిడి):** కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు పోరాటాల ద్వారా పెట్టుబడిదారుల మెడలు వంచాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని పెట్టుబడిదారులకు దాసోహం చేసే విధంగా కార్మిక చట్టాలను బలహీనపరుస్తున్నారని విమర్శించారు. కొత్త కార్మిక చట్టాల అమలుతో ఆకలి, పేదరికం, నిరుద్యోగం మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించడం ఆపాలని డిమాండ్ చేశారు. బడా కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వాలు రైతుల రుణ విమోచనకు చట్టం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంలో కేంద్రం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతోందని ఆరోపించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. జైల్ భరో కార్యక్రమానికి బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కుర్వ పల్లయ్య మద్దతు తెలిపారు. అనంతరం నాయకులు, కార్మికులు, రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. గోపాల్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ, వీవీ నరసింహ, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రియాంక హత్యకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలి

ఎక్లాస్‌పురంలో విషాదఛాయలు.. అఖిలపక్షం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులకు త్వరితగతిన శిక్ష విధించాలని డిమాండ్






**గద్వాల ప్రతినిది(సింగిడి):** ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన మెడికో విద్యార్థి డాక్టర్ ప్రియాంక దారుణ హత్య ఘటనతో ఆమె సొంతూరు ఎక్లాస్‌పురం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. వారం రోజుల పాటు మృత్యువుతో పోరాడిన ప్రియాంక చివరకు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ గ్రామానికి చెందిన యువతి దారుణ హత్యకు గురికావడంతో ప్రజలు కన్నీరుమున్నీరయ్యారు. ప్రియాంక మృతికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిందితులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం చేయాలని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతిమ యాత్రలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువకులు, విద్యార్థినీ విద్యార్థులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రియాంకకు ఘన నివాళులు అర్పించారు. ప్రియాంక కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్థులను కలచివేశాయి. తమ కుమార్తెను కోల్పోయిన తల్లిదండ్రుల ఆవేదన అందరినీ కంటతడి పెట్టించింది. కన్నకూతురిని చివరిసారిగా చూసుకున్న తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. సొంతూరులోనే తల్లిదండ్రులు ప్రియాంకను సమాధి చేశారు. ప్రియాంకకు జరిగిన అన్యాయంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు ఎలాంటి రాజకీయ, ఇతర ఒత్తిళ్లకు తావులేకుండా చట్ట ప్రకారం కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి, విచారణను వేగవంతం చేసి దోషులకు త్వరితగతిన శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు పూర్తి భద్రత కల్పించడంలో ప్రభుత్వం మరింత కఠినమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మహిళల రక్షణకు ప్రత్యేక వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రియాంక కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని అఖిలపక్ష నాయకులు ప్రకటించారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

## కేసు నమోదు చేసిన ఎస్ఐ కురుమూర్తి



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి మండలం లోని గుండూరు గ్రామం నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తు న్నారన్న సమాచారంతో ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు అదు పులోకి తీసుకుని పరిశీలించారు. ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. సంబంధిత నిబంధనల ప్రకారం ట్రాక్టర్ యజమాని/డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్ ఐ కురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ,ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కురుమూర్తి హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు

# నిరసనగా భారీ ర్యాలీ



**కల్వకుర్తి (సింగిడి)::** ఆగస్టు 10న జైలు భరో కార్యక్రమ సందర్భంగా సి ఐ టి యూ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కల్వకుర్తి మండల కేంద్రంలో శివాజీ చౌక్ నుంచి మహబూబ్ నగర్ చౌరస్తా వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరిగింది. మోదీ ప్రజావ్యతిరేక విధానాలకు నినాదాలు భారీ ఎత్తున చేయడం జరిగింది. అనంతరం మహబూబ్ నగర్ చౌరస్తాలో భారీ ఎత్తున రాస్తారోకో చేయడం జరిగింది. అరగంటపాటు ఎక్కడికక్కడ వాహనాలు నిలిపివేయాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కలరాయడానికి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలి అలాగే వివిజి రాంజీ పథకాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథాతధంగా అమలు చేయాలి. నూతన విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. రైతులకు నష్టం కలిగించే అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని స్వామినాథన్ సిఫార్సులు అమలు చేసి రైతులకు గిట్టుబాటు ధరలు అందించాలని అని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సి ఐ టి యు జిల్లా నాయకులు శివరాం, బాలయ్య భవన నిర్మాణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింత ఆంజనేయులు, ఉపాధ్యక్షులు చిలుక బాల్ రెడ్డి జిల్లా నాయకులు మల్లారెడ్డి, కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి బాలస్వామి, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు శోభావతి, మహేష్, రాజు, స్వప్న, అలివేలు, తో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు జిల్లా స్టడీ సర్కిల్ కన్వీనర్ ఏపీ మల్లయ్య , బ్రహ్మం , ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకటయ్య, జగన్, తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా

పాల్గొన్న చుంచుపల్లి సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి



**కొత్తగూడెం, (సింగిడి):** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చుంచుపల్లి సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఆధ్వర్యంలో సోమవారం కొత్త గూడెం రైల్వే స్టేషన్ ఎదుట జైల్‌భరో నిరసన, ధర్నా నిర్వ హించారు. కొత్త కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, నిత్యావ సర ధరలను నియంత్రించాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని వ్యతి రేకిం చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూక్య జనార్ధన్, బాబు, వేణు, సత్తు రామకృష్ణ, సీపీఐ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

త్రివర్ణ పతాకాల పంపిణీ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి)::** ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. బీజేపీ ఆధ్వ ర్యంలో సోమవారం నగరంలోని బస్టాండ్ వద్ద త్రివర్ణ పతకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తితో దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి సంవత్స రం "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుం దన్నారు. కేవలం స్వాతంత్ర దినోత్సవం ఒక్కరోజు జెండా ఎగురవేయడమే కాకుండా ఇంటిపై నిత్యం రెపరెపలాడాల న్నారు. అలాగే ఈ నెల 14న జరిగే తిరంగా ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్ కర్ లక్ష్మీ నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# 12వ వేతన కమిటీ ఏర్పాటుకై సింగరేణి జేఏసీ సమరం

కొత్తగూడెం జి.ఎం. ఆఫీస్ ఎదుట కార్మికుల భారీ ధర్నా:

కేంద్ర వైఖరిపై ఎండగట్టిన జాతీయ సంఘాల నాయకులు..జిఎంకు వినతిపత్రం అందజేత







**కొత్తగూడెం, (సింగిడి):** సింగరేణి సంస్థ పరిరక్షణతో పాటు బొగ్గు కార్మికులకు 12వ వేతన కమిటీని (జేబీసీసీఐ) తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట సింగరేణి జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు భారీ ఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ చేపట్టిన ఈ ఆందోళనతో జి.ఎం. ఆఫీస్ ప్రాంగణం వేడెక్కింది.

**గనుల నుండి డిపార్ట్‌మెంట్ల వరకు కదిలొచ్చిన కార్మికలోకం**

ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎం. డి. రజాక్, సీఐటీయూ నాయకులు మంద నరసింహారావు ప్రాతినిధ్యం వహించగా, ఐఎన్టీయూసీ నాయకులు, డివిజన్ వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. కొత్తగూడెం ఏరియాలోని పివికె 5 ఇంక్లైన్, వికె కోల్ మైన్స్‌తో పాటు ఆర్. సి. హెచ్. పి, ఏరియా వర్క్‌షాప్, ఎస్. ఎన్. పి. సి, ఏరియా స్టోర్స్, మైన్స్ రెస్క్యూ స్టేషన్, జీవీటీసీ, సివిల్ డిపార్ట్‌మెంట్, డిస్పెన్సరీల నుండి డి. ఎల్. ఆర్ కార్మికులు, మహిళా నాయకులు విధి నిర్వహణ పక్కనబెట్టి ధర్నాలో పాలుపంచుకున్నారు.

**లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి .. - సింగరేణిని కాపాడుకోవాలి**

ఈ సందర్భంగా జాతీయ సంఘాల నాయకులు మాట్లాడుతూ... కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేలం పాటలతో పనిలేకుండా పాత పద్ధతిలోనే సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని, ముఖ్యంగా సత్తుపల్లి-3, కోయగూడెం ఓసి-3 బ్లాక్‌లను పూర్తిస్థాయిలో సింగరేణి వశం చేయాలని స్పష్టం చేశారు. వేజ్ బోర్డును నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, జెండా ఏదైనా కార్మిక సంక్షేమమే ఎజెండాగా ఐక్యపోరాటాల ద్వారానే 12వ వేతన బోర్డును సాధించుకోగలమని పిలుపునిచ్చారు.

**జి.ఎం.కు వినతిపత్రం సమర్పణ**

ధర్నా అనంతరం జేఏసీ నాయకులు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సిహెచ్. వెంకటరమణను కలసి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రధాన నాయకులు బుటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, ఎం. కొమరయ్య, పోశం శ్రీనివాస్, భీముడు, విప్లవ కుమార్, జీదుల రాజేశ్వరరావు, గోపు కుమార్ స్వామి, మహిళా నాయకులు వెంకట దుర్గా, అశ్విని, వాసంతిక, అనుష, ఉమా స్పందన, రమణలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొని ధర్నాను దిగ్విజయం చేశారు. కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు, బుటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య ఎం కొమరయ్య, పోశం శ్రీనివాస్, భీముడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు , ఉద్యోగులు, డి. ఎల్. ఆర్ ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

singidinews@gmail.com

Happy Birthday Hansika



# హుషారు పిట్టలు ట్రైలర్ విడుదల

అన్షు, వాసవి గణెళిశన్ జంటగా రూపొందిన చిత్రం 'హుషార్ పిట్టలు'. బిక్షు దర్శకుడు. వెంకట్ యాదవ్ నిర్మాత. ఆగస్టు 15న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు 'ఏ ప్రేమ కావాలి.. కన్నవాళ్లదా.. ప్రేమించిన వాళ్లదా..' అనే డైలాగులు యూత్‌ను ఆలోచింపచేస్తున్నాయి.



## టాక్సిక్‌ను సక్సెఎస్ ఫుల్‌గా
# తీసి చూపా...




'టాక్సిక్' ప్రారంభించినప్పుడు చాలా మంది 'నీ వల్ల కాదు' అన్నారని అలాంటివాళ్లకు చిత్రం పూర్తి చేసి తన సత్తా చూపించానని దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఎమోషనల్ అయ్యారు. ఆమె దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ ఈవెంట్‌లో దర్శకురాలు మాట్లాడుతూ.. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు చాలా మంది తనను ఎన్నో మాటలు అన్నారని గుర్తుచేసుకున్నారు. తనపై నమ్మకం ఉంచి.. ఈ సినిమాను అంగీకరించినందుకు యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.


## ఇంద్రపుత్రగా
# కిరణ్ అబ్బవరం

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవల ఆయన



నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్మాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎలాన్ చేస్తున్నారు. ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం.

## మహేశ్ బాబు ఎఐ వీడియో షేర్ చేసి వంగా
### కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్



ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.

# కపాలిలో హన్సిక
## ఫస్ట్ లుక్ విడుదల

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.



Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090